

రస్తాగా అధికారులు ధ్రువీకరించిన పరిస్థితి

శాస్త్రోక్తంగా.. చక్రస్నానం



స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

గుర్రంకొండ, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం చక్రస్నానాన్ని వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారిని మేల్కొలిపి ఆలయశుద్ధి, తోమాలసేవ, అర్చన, అభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి స్వామి ఆయుధమైన శ్రీచక్రానికి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ చక్రస్నానాన్ని, సాయంకాలం ఉత్సవమూర్తులకు ఊంజల్ సేవను నిర్వహించారు. స్వామి ని దర్శించుకోవడానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధికంగా భక్తులు వచ్చారు. కార్యక్రమంలో ఆలయాధికారి కృష్ణమూర్తి, అర్చకులు గోపాల్‌భట్టర్, కృష్ణరాజ్, కృష్ణప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేతో తిప్పలెన్నో..

- వైసీపీ హయాంలో జగనన్న భూరక్ష పేరిట హడావిడి
- తప్పుల తడకగా రీసర్వే
- తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రైతులు ప్రదక్షిణలు
- పైలెట్ ప్రాజెక్టు పేరుతో మళ్లీ సర్వేలు



రస్తాగా రీసర్వేలో నమోదు చేసిన మామిడి తోట

సాగు భూమిని రస్తా చేశారు



సర్వే నెంబరు 319-2లో మామిడి తోట, వరి పైరు సాగులో ఉంది. గత ప్రభుత్వంలో రీ సర్వే సందర్భంగా పట్టా భూమిని రస్తాగా నమోదు చేశారు. పైగా ఆన్‌లైన్ నుంచి కూడా తొలగించారు. నా భూమి మొత్తాన్ని రికార్డులోకి ఎక్కించాలి.

- చిన్నప్పరెడ్డి, రైతు, చింతలయ్యగారిపల్లె

సుండుపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న భూరక్ష పేరుతో చేసిన హడావిడి ఇంతా అంతా కాదు. సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. తూతూ మంత్రంగా శిక్షణ ఇచ్చారు. రీసర్వేల పేరుతో డ్రోన్లు తిప్పారు. ఛాయాచిత్రాలు తీశారు. చిత్ర విచిత్ర విన్యాసాలు చేశారు. రైతులను సర్వేల పేరుతో మభ్యపెట్టారు. సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేశారు. రైతుల పాసుపుస్తకాలపైన జగన్ బొమ్మలను ముద్రించి రైతులకు అందజేశారు. అయితే రీ సర్వే జరిగిన రెవెన్యూ గ్రామాల్లో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు మళ్లీ రీసర్వే చేసేందుకు నిర్ణయించారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరి చేసే పనిలో ఉన్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

ఇదేనా.. రీసర్వే

సుండుపల్లె మండలంలోని అక్కంపల్లి, తిమ్మసముద్రం, భాగంపల్లి, పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీల్లో రీసర్వే కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి వారిలో తిమ్మసముద్రం గ్రామ పంచాయతీకి చెందిన దేవపట్ల రాజమ్మ కుటుంబం ఒకటి. ఆమెతో పాటు ఆమె కుమారుడు చిన్నపరెడ్డికి 319-2 సర్వే నెంబర్‌లో 1.20 ఎకరాలు పట్టా భూమి ఉంది. అందులో సుమారు 15 ఏళ్ల నాటి మామిడి చెట్లు ఉన్నాయి. వరి పైరు సాగులో ఉంది. సర్వే సమయంలో ప్రభుత్వం అందించిన మ్యాపు కూడా పట్టా భూమిలో మామిడి చెట్లు ఉన్నట్లు చూపిస్తోంది. అయితే ఆ పట్టా భూమిని ప్రభుత్వ రస్తాగా రీసర్వేలో నమోదు చేశారు. పట్టా భూమిని ప్రభుత్వ భూమిగా నమోదు చేయడంతో ఆ రైతు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.

- పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ బెస్తపల్లెకు చెందిన సుధీర్‌నాయుడు కుటుంబీకులకు సర్వే నెంబర్లు 124, 118, 119, 348, 173-3, 77-3లో సుమారు 10 ఎకరాల భూమి ఉంది. రీసర్వే సమయంలో ఇతరులతో కలిపి ఒకే ఎల్‌పీఎం నెంబరు ఇచ్చారు. ఆన్‌లైన్‌లో తమ భూమి వివరాలు నమోదై ఉన్నాయని సర్వేకు వచ్చిన అధికారులకు డాక్యుమెంట్లు చూపించినా, ఉన్న భూమిని తగ్గించి ఇతరులతో జాయింట్ చేయడంతో తనఖా చేసుకోలేక, రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఇతరులకు అమ్ముకోలేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ చింతలయ్యగారిపల్లెకు చెందిన మాలేపాటి మల్లమ్మకు సర్వే నెంబరు-714లో 1.75 సెంట్ల పట్టా భూమి ఉంది. దీన్ని గయాలు గుట్ట అని రెవెన్యూ అధికారులు రీసర్వేలో నమోదు చేయడంతో.. తాతల కాలం నాటి పట్టా భూమిని తప్పుగా నమోదు చేశారని, సరి చేయాలని కోరుతున్నారు.
- తిమ్మసముద్రం గ్రామ పంచాయతీ కామిరెడ్డిచెరువు సమీపంలో 626-8 సర్వే నెంబర్‌లో జి.రామయ్య పేరుతో 3.03 ఎకరాలు భూమి ఉండగా రీసర్వే చేసి 2.05 ఎకరాలు మాత్రమే ఉన్నట్లు రికార్డులకు ఎక్కించారు. ఆయన రెండు నెలల క్రితం మృతి చెందారు. మిగిలిన సుమారు ఎకరా భూమి ఎక్కడికి వెళ్లిందని వారి కుటుంబ సభ్యులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ విధంగా రీసర్వే చేసిన నాలుగు గ్రామ పంచాయతీల్లో పెద్ద సంఖ్యలో తప్పులు దొర్లాయి. ఇదంతా గ్రామ సర్వేయర్, గ్రామరెవెన్యూ అధికారి బాధ్యతారాహిత్యం కారణంగానే జరిగిందని స్పష్టంగా తెలుస్తోంది. ఈ ప్రభుత్వంలోనైనా రీసర్వే తప్పులను సరి చేసి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రీసర్వే చేసి.. ఆన్‌లైన్‌లో తీసేశారు



మా కుటుంబ సభ్యుల పేరుతో ఉన్న భూమి వివరాలను ఆన్‌లైన్ నుంచి తొలగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామసభ, రెవెన్యూ సదస్సుల్లో వినతి పత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. సమస్య పరిష్కరించకుండానే పరిష్కరించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

- సుధీర్‌నాయుడు, రైతు, బెస్తపల్లి

రీసర్వే సమస్యలను పరిష్కరిస్తాం

జాయింట్ సర్వే నెంబర్లతో పాటు ఇతర సమస్యలు పరిష్కరిస్తాం. రైతుల నుంచి అర్జీలు తీసుకొని ఆ ప్రకారం పరిష్కరించాలని పైఅధికారులు ఆదేశించారు. సర్వేతో సమస్యలు ఏర్పడిన రైతులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సమస్యను అర్జీ రూపంలో తెలియజేయండి.

- దైవాదీనం, తహసీల్దార్, సుండుపల్లె

పైలెట్ ప్రాజెక్టుగా ముదుంపాడు

సుండుపల్లె మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ముదుంపాడు గ్రామ పంచాయతీని ఎన్నుకున్నారు. ఈ పంచాయతీలో గత నెల 8వ తేదీ నుంచి రీసర్వే ప్రారంభించారు. ఈ రెవెన్యూ గ్రామంలో 4,070.97 ఎకరాల్లో రీసర్వే నిర్వహించాల్సి ఉంది. మొత్తం 14 బ్లాకులుగా విభజించారు ఒక్కొక్క బ్లాక్‌లో సుమారు 200 నుంచి 300 ఎకరాల వరకు ఉండేలా చర్యలు తీసుకున్నారు. 1,185 సర్వే నెంబర్లలో 1,701 రైతులకు ఖాతాలు ఉన్నాయి. 4,463 సబ్ డివిజన్లలో మూడు టీంలుగా విడిపోయి రెవెన్యూ అధికారులు, సిబ్బంది సర్వే నిర్వహిస్తున్నారు. రాజంపేట సబ్‌కలెక్టర్ నిధియాదేవి పైలెట్ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నారు.



ముదుంపాడులో రీసర్వే చేస్తున్న అధికారులు

జిల్లాలో పలువురు సీఐలు బదిలీ



రాయచోటి అర్బన్ సీఐగా బాధ్యతలు చేపడుతున్న బీవీ చలపతి

రాయచోటిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు ఇచ్చారు. రాయచోటి సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను కర్నూలు జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లా ఆలూరు సీఐగా పనిచేస్తున్న వెంకటచలపతిని నియమించారు. అలాగే అన్నమయ్య జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేస్తున్న రవిశంకర్‌రెడ్డిని కర్నూలు జిల్లా ఆలూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్న శంకర్‌మల్లయ్యను అన్నమయ్య జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. రాజంపేట పట్టణం మన్నూరు పోలీస్‌స్టేషన్ సీఐగా పనిచేస్తున్న మహమ్మద్‌అలీని అన్నమయ్య జిల్లా సైబర్ క్రైమ్‌కు బదిలీ చేశారు. అలాగే కడప వీఆర్‌లో ఉన్న సీఐ కుళాయప్పను మన్నూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కాగా, రాయచోటి పట్టణ సీఐగా బీవీ చలపతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల రాయచోటి పట్టణంలో చోటు చేసుకున్న సంఘటనల దృష్ట్యా ఇక్కడ సీఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌ను కర్నూలు వీఆర్‌కు బదిలీ చేశారు.

మహిళల భద్రతకు రక్షణ కవచం శక్తి యాప్

- ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కోసం శక్తియాప్‌ను ప్రవేశ పెట్టిందని, ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచారాలు, హింసాత్మక సంఘటనలను నివారించడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శక్తియాప్‌తో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా మహిళలు ఏదైనా ఆపదలో ఉన్నప్పుడు ఈ యాప్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వవచ్చునన్నారు. యాప్ ఓపెన్ చేసి ఎస్ఓఎస్ బటన్‌ను నొక్కితే వారు ఉన్న ప్రాంతం దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు, డయల్ 112 నెంబర్‌కు చేరుతుందన్నారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపడతారని తెలిపారు. ఇక ఈ యాప్ ద్వారా నైట్ షెల్టర్ల వివరాలు, జిల్లా కేంద్రంలోని హాస్పిటళ్లు, ఒన్‌స్టాప్ సెంటర్ అందుబాటులో ఉంటుందన్నారు. మహిళా హక్కులు, రక్షణ చట్టాలు, ప్రభుత్వ నిబంధనల గురించి పూర్తి వివరాలు పొందవచ్చునన్నారు. అత్యవసర సమయంలో మహిళలు, చిన్నారులు తమకు ఎదురయ్యే ఇబ్బందులపై పోలీసు సిబ్బంది తక్షణమే స్పందిస్తారన్నారు. కావున జిల్లాలో ప్రతి మహిళ, విద్యార్థినులు, బాలికలు, ఉద్యోగినులు, గృహిణులు మొబైల్‌లో శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎస్పీ కోరారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (శనివారం సాయంత్రం)	సెహరీ (ఆదివారం ఉదయం)
రాయచోటి	6.30	5.03
మదనపల్లె	6.31	5.08
రాజంపేట	6.28	5.09
పీలేరు	6.29	5.01

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి



కురబలకోట మండలం తానామిట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

6


సెలవు రోజూ 'రెవెన్యూ' కార్యాలయాలు బిజీ.. బిజీ

- ఫ్రీ హోల్డ్ భూములతో మల్లగుల్లాలు



కలికిరిలో కంప్యూటర్ల ముందు మల్లగుల్లాలు పడుతున్న వీఆర్వోలు, ఇతర సిబ్బంది

కలికిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎమ్మార్వో కార్యాలయాలన్నీ శుక్రవారం రెవెన్యూ సిబ్బంది, అధికారులతో బిజీ బిజీగా కనిపించాయి. హోళీ సెలవు దినమైనా.. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలోని 30 ఎమ్మార్వో కార్యాలయాలు ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకూ ఏకధాటిగా పనిచేశాయి. అన్ని మండలాల్లోనూ తహసీల్దార్లు, డీటీలు, రీ సర్వే డీటీలు, ఆర్ఐలు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, వీఆర్వోలు, కంప్యూటర్ ఆపరేటర్లు హోళీ సెలవు రోజున పనిచేయాలని జిల్లా అధికారులు ఆదేశించడంతో రోజువారీ పనిదినాల్లో కన్నా మించి చురుగ్గా పనిచేశారు. మరో వైపు జిల్లా అధికారులతోపాటు సబ్ కలెక్టరు కార్యాలయాల అధికారులు కూడా ఎమ్మార్వో కార్యాలయాల్లో జరుగుతున్న పనులను పదే పదే పర్యవేక్షిస్తూ ఎప్పటి కప్పుడు సూచనలు జారీ చేశారు. ఫ్రీ హోల్డ్ భూము రీ వెరిఫికేషన్ ప్రక్రియలో జరి గిన తప్పులను సరి చూడటం, సవరించడం, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటి పనులు చేయడంలో ఉదయం నుంచి పూర్తిగా నిమగ్నమయ్యారు. ఫ్రీ హోల్డ్ భూముల వెరిఫికేషన్ పనులు రెండు నెలల క్రితమే పూర్తయినా, ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు వేర్వేరు కోణాల్లో కొత్త కొత్త వివరాలు కోరడంతో ఈ పనులు ఎడతెగకుండా నెలల తరబడి కొనసాగుతున్నాయి. శనివారం నాటికల్లా ఫ్రీ హోల్డ్ రీ వెరిఫికేషన్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసి ఆన్‌లైన్‌లో పొందుపరిచే పనిని పూర్తి చేయాలని జిల్లా అధికారులు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో శుక్రవారం రాత్రికి కొన్ని మండలాల్లో పనులు పూర్తి చేయగా.. మరికొన్ని మండలాల్లో శనివారం కూడా కొనసాగే పరిస్థితులున్నట్లు సమాచారం.




ఎండాకాలంలోనూ... మంచుదుప్పటి

దుద్యాల పెద్దజంగంపల్లెలో కొయ్యకొండను కమ్మేసిన పొగమంచు

ప్రకృతిలో వింత వాతావరణం నెలకొంది. సాధారణంగా శివరాత్రి వరకు శీతాకాలం ప్రభావంతో చలి, మంచు వాతావరణం ఉంటుంది. మార్చి నెల సగం దాటుతోంది. అయితే పగలు మాత్రం ఎండలు మండుతున్నాయి. రాత్రి పొద్దుపోయాక చలివాతారణం నెలకొని.. తెల్లవారు జామున పొగమంచు అలుముకుంటుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం దుద్యాల గ్రామం పెద్దజంగంపల్లి వద్ద కొండంతా పొగమంచు కమ్ముకోవడం చూపరులను ఆకట్టుకుంది.

-(ఆంధ్రజ్యోతి- సంబేపల్లె)

పొగమంచు వీడాక కొండ ఇలా..



ప్రభుత్వ పాఠశాలల బాధ్యత ఇక ప్రజలదే

- పీఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జమాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం విద్యాశాఖకు ప్రమాదకర పరిస్థితులు దాపురించాయని, ఇక ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశాల్లో ఐదు రకాల బడులను ఏర్పాటు చేస్తున్నామని టీవీల్లో, పత్రికల్లో ఊదరగొడుతున్నారని అన్నారు. కానీ క్షేత్రస్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంఈవోల సమావేశం చూస్తే పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ పేరుతో ప్రాథమిక పాఠశాలలను లేకుండా చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులారా బలి కాబోతున్న గ్రామ ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత తల్లిదండ్రులదే అని.. వారిలో చైతన్యం తెచ్చే బాధ్యత మనందరిదీ అన్నారు. జిల్లా అధ్యక్షుడు పీవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ మూడవ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్ల బోధనకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం 7,580 సెకండ్‌గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చిందని.. ఇవన్నీ ఇప్పుడు సర్‌ప్లస్ అవుతాయని చెప్పారు. సీపీఎస్ జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి, దిలీప్‌కుమార్, రామలక్ష్మిరెడ్డి, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లెక్కల జమాల్‌రెడ్డి

గిరిజన మహిళపై వైసీపీ నేత బంధువు దాడి

- హోం మంత్రి అనితకు ఫిర్యాదు చేస్తాం

6

పాముకాటుతో రెండేళ్ల చిన్నారి మృతి

6

గుర్రంకొండలో దొంగలు పడ్డారు

- మూడు దుకాణాల్లో చోరీ



6


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్

పవన్ అభిమానం


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహద్దూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..




పిఠాపురం: 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం./కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.



పాము కాటుతో రెండేళ్ల చిన్నారి మృతి


అమృతసాగర్ (ఫైల్‌ఫొటో)

నిమ్మనపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీకి చెందిన పద్మనాభం,సుభాషిణిల కుమారడు నీరుగిట్టి అమృతసాగర్(2) జాతర చూసేందుకు గురువారం తన తల్లిదండ్రులతో కలసి చౌడేపల్లికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి 7గంటల సమయంలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా పాటుకాటుకు గురయ్యాడు. గమనించిన తండ్రిదండ్రులు వెంటనే అమృతసాగర్‌ను చౌడేపల్లి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు ఆలస్యంగా స్పందించడంతో, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు పరీక్షచేసి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరునవిపించారు. కాగా తల్లి పద్మావతి సోమల మండలంలో లెక్చరర్‌గా పని చేస్తుండగా తండ్రి పద్మానాభం నిమ్మనపల్లి ఎమ్మార్‌సీలో సీఆర్పీగా పని చేస్తున్నాడు. చిన్నారిమృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

గిరిజన మహిళపై వైసీపీ నేత బంధువు దాడి


మీడియాతో మాట్లాడుతున్న సునీత

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన వైసీపీ నేతపై పోలీసులకు ఫిర్యాదు చేసి, 24 గంటలు అవుతున్నా ఇంతవరకూ కేసు కట్టలేదని ఓ గిరిజన మహిళ మీడియా ఎదుట వాపోయింది. బాధితురాలి కథనం మేరకు...పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన కె.కృష్ణానాయక్ భార్య సునీతకు అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నేత బంధువు బాలిరెడ్డికి ఇంటి స్థలం విషయమై ఐదేళ్లుగా వివాదం నడుస్తోంది. గురువారం సాయంత్రం బాలిరెడ్డి పునాదులు నిర్మిస్తుం డగా సునీత వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో బాలిరెడ్డి, అతని బంధువులు కలసి సునీత జుట్టుపట్టుకుని లాగి, ఇనుపరాడ్డు, రాళ్లతో ఆమె తలపై దాడి చే శారు. ఈ దాడిలో తలపగలడంతో సునీత స్పృహ కోల్పోయింది. కుటుంబసభ్యులు ఆమెను మదనపల్లెలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం సు నీత స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కానీ వారినుంచి స్పందన లేకపోవడంతో సాయంత్రం వరకు వేచి చూసిన ఆమె మీడియాతో తన గోడు వెళ్లబోసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాల్‌రెడ్డిపై ఫిర్యాదు చేస్తే టూటౌన్ పోలీసులు తనపై కేసు కట్టారని ఆరోపించింది. బాధితురాలిపై కేసు నమోదు చేశారని శుక్రవారం హోమంత్రికి ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించింది. ఈ విషయమై ఎస్‌ఐ రహీముల్లాను వివరణ కోరగా స్టేషన్‌కు వచ్చిన బాధితురాలు తమకు ఫిర్యాదు ఇవ్వలేదని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పి ఇంటికి వెళ్లిపోయిందన్నారు. ఆమె ఫిర్యాదు ఇస్తే ప్రాథమిక విచారణ చేసి న్యాయం చేస్తామని వివరించారు.

గుర్రంకొండలో దొంగలు పడ్డారు


దొంగలు కత్తిరించిన దుకాణపు రేకు, మరో దుకాణంలో ఖాళీగా గల్లాపెట్టె

గుర్రంకొండ, మార్చి 14: పట్టణంలో గురు వారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. బస్టాండు ప్రాంతంలో చిన్న వ్యాపారులు ఏర్పా టు చేసుకున్న రేకుల బంకులకు కన్నాలేసి అంది నమేరకు దోచుకెళ్లారు. పట్టణానికి చెందిన షైషా వలి దుకాణం వెనుక వైపు రేకును కత్తిరించి లోపలికి చొరబడి రూ.30 వేలు నగదు, రూ.30 విలువ చేసే సిగరెట్లను చోరి చేశారు. పక్కనే ఉన్న ఆంధ్ర ఎలక్ట్రికల్స్ దుకాణం పైకప్పు రేకును కత్తిరించి రూ.60 వేలు నగదు, జాతీయ రహదారిపై ఉండే బాషాఖాన్ జనరల్ స్టోర్ పైకప్పు రేకును కత్తిరించి రూ.15 వేలు విలువ గల సిగరెట్లు చోరీ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఒక రోజు మూడు దుకాణాల్లో చోరీ జరగడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గుర్రంకొండ పట్టణంలో బయట వ్యక్తులు అధికంగా ఉండడంతోనే చోరీలు జరుగుతున్నట్లు ప్రజలు, వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి


కురబల కోట మండలం తానామిట్ట వద్ద ఢీకొన్న వాహనాలు


మృతి చెందిన భాస్కర్, సయ్యద్ హసన్


ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు


ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ (ఫైల్‌ఫొటో)

కురబలకోట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కురబల కోట, గుర్రంకొండ మండలాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి.. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి గ్రానైట్ బండలతో రాజమండ్రికి వెళుతున్న లారీ, సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట నుంచి బెంగళూరుకు వెళుతున్న కంటైనర్ లారీ శుక్రవారం వేకువన మండలంలోని తానామిట్ట వద్ద ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో రెండు వాహనాలు అధిక వేగంతో వెళుతుండడంతో నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో కర్నాటక రాష్ట్రం హాసన్ జిల్లా హలేహళ్లికి చెందిన కంటైనర్ డ్రైవర్ భాస్కర్(36), రాయచోటికి చెందిన లారీ క్లీనర్ సయ్యద్ హస్సేన్(28) అక్కడిక్కడే మృతి చెందారు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన క్లీనర్ మృతదేహాన్ని వాహనం ముందు బాగాన్ని జేసీబీ సాయంతో తొలగించి బయటకు తీశారు. తల, కాళ్లకు బలమైన గాయాలైన లారీ డ్రైవర్ గాలివీడుకు చెందిన నాగేశ్వరరావును 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రుయా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు, సీఐ సత్యనారాయణ పరిశీలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్రంకొండ: మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన వెంకటప్ప కుమారుడు నాగరాజు(45) శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం తరిగొండకు వచ్చాడు. స్వామి వారిని దర్శించుకొని ఆటోలో వాల్మీకిపురానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న నాగరాజ కిందపడడంతో తలకు తీవ్ర రక్తగాయమైంది. వెంటనే అతనిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

బొలెరో ఢీకొని ఆర్టీసీ డ్రైవర్..

మదనపల్లె అర్బన్: మండలంలోని చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన చల్లా సుధాకర్ (48) మదనపల్లె ఆర్టీసీ టూ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మదనపల్లె నుంచి బైక్‌పై బార్లపల్లెకు వెళుతుండగా బెంగళూరు నుంచి కూరగాయల లోడుతో వస్తున్న బొలెరో ఢీకొట్టింది,

ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తాలూకా పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకట రమణ తెలిపారు.

వర్డ్‌పవర్ రాష్ట్ర స్థాయి పోటీలో చింతమాకులపల్లె విద్యార్థికిమూడో స్థానం


అన్విత్‌కు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కలికిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ చాంపియన్‌షిప్‌లో మండలంలోని కలికిరి పంచాయతీ చింతమాకులపల్లె ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న పి. అన్విత్ మూడో స్థానంలో నిలిచాడు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆంగ్లంపై ఏ స్థాయిలో పట్టుందన్న విషయాన్ని గుర్తించ డానికి విభా లీప్ వర్డ్ సంస్థ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో 'ది వర్డ్ పవర్ చాంపియన్‌షిప్' పేరుతో విద్యార్థుల మధ్య ప్రతి ఏటా పోటీలు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 27న రాయచోటిలో జరి గిన జిల్లా స్థాయి పోటీల్లో అన్విత్ ప్రథమ స్థానం లో నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో పోటీ పడటానికి అర్హత సాధించాడు. విజయవాడ టూరిజం ప్రాంగణంలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అన్విత్ మూడో స్థానం దక్కించుకున్నా డు. గురువారం రాత్రి అతనికి అవార్డును బహూకరించారు. విభా సంస్థ పీడీ శ్రీనివాసరావు, కార్యదర్శి వీరనారాయణ, రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు అన్విత్‌ను అభినందించి అవార్డుతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆ విద్యార్థిని తీర్చిదిద్దిన ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయిని హసీనాను అభినందించారు. కాగా అన్విత్ తల్లి ఎం.హేమలత వాల్మీకిపురం మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్నారు. ఏ మా త్రం బేషజాలకు పోకుండా తన కుమారుడిని గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే చదివిస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె, డ్రిప్ పైపులు దగ్ధం


కాలిపోయిన గుడిసె

వాల్మీకిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గుడిసె, డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. మండలంలోని గండబోయనపల్లె పంచాయతీ కంభంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, వెంకట రమణా రెడ్డి పొలాలు, రైల్వే రోడ్డుకు సమీపంలో ఉన్నాయి. రైల్వే ట్రాక్ పక్కన గడ్డి ఏపుగా పెరిగి పోవడంతో దానిని తొలగించేందుకు శుక్రవారం రైల్వే సిబ్బంది నిప్పంటించారు. దీంతో మంట లు ఎగిసి తమ పొలాల్లోని డ్రిప్ పైపులు, టమోటా పంట, గుడిసె కాలి పోయాయని రైతులు వా పోయారు. ప్రభుత్వం స్పందించి తమకు జరిగిన నష్టం విషయమై ఆదుకోవాలని కోరుతున్నారు.

బిదినంచెర్లలో ఘనంగా గోపూజ మహోత్సవం


గ్రామోత్సవంలో భక్తులు

సింహాద్రిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిదినంచెర లో శుక్రవారం గోపూజ నిర్వహించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారి పూజ, కలశ పూజ, గోపూజ, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భాగవత పండితులను బీఎస్ బ్రంహ్మానందరెడ్డి, జడ్పీటీసీ బీఎస్ ఝాన్సీరాణి దంపతులు శాలువాతో సత్కరించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

రేపు కడపలో మాజీ సైనికుల ర్యాలీ, సమావేశం

మదనపల్లె టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబీకుల సమస్యల పరిష్కారం కోసం 16న కడపలో ర్యాలీ, సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక మాజీ సైనికుల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం కడపలో నిర్వహించే మాజీ సైనికుల కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ సబ్ ఏరియా లెఫ్టినెంట్ జనరల్ అజయ్‌మిశ్రా, రిటైర్డ్ బ్రిగేడియర్ బి.వెంకటరెడ్డి, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్, కడప కలెక్టర్ హాజరవుతారన్నారు. మాజీ సైనికుల కుటుంబాల విద్య, వైద్యం, పెన్షన్, ఇతర సమస్యలను అధికారులకు విన్నవించుకోవచ్చన్నారు. సైనిక వితంతువుల కోసం మదనపల్లె నుంచి రెండు ఉచిత బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కడపలో జరిగే కార్యక్రమాన్ని మాజీ సైనికులు, వారి కుటుంబీకులు విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు 95024 26333 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని శ్రీనివాసులు నాయుడు కోరారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యవరం చియ్యవరం హరిజనవాడకు చెందిన ఎర్రతోట మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమ్మపల్లికి చెందిన ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. బాధితుడు మహేష్ పట్టణంలోని బైకు షోరంలో గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా వేణు మరో ఇద్దరు బైకుకు అడ్డుపడి దాడి చేసినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక వ్యాపారులు కొట్టారని టిప్పర్ డ్రైవర్ ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తక్కువ రేటుతో మదనపల్లెకు ఇసుక తరలిస్తున్నావంటూ ఇసుక వ్యాపారులు తనను కొట్టారని టిప్పర్ డ్రైవర్ సుబ్రమణ్యం శుక్ర వారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము 24 వేలకు టిప్పర్ ఇసుక అమ్ముతుంటే నీవు రూ. 18,500కే ఇసుక అమ్ముతావా అంటూ బిల్డర్ భరత్, ప్రసాద్‌రెడ్డి, రమేష్, ముబారక్‌బాషా, మణి, అమర, మరికొందరు కలిసి కొట్టారని బాధితుడు తెలిపారు. ఇకపై ఇసుక మదనపల్లెకు తీసుకురాకూడదని, తెస్తే తమ వ్యాపారం దెబ్బతింటుందని హెచ్చరించారంటూ స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం రద్దు

● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



నందిమండలంలోని ఉన్నత పాఠశాల

పెండ్లిమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోనే మొట్టమొదటగా నందిమండలం గ్రామంలో 1948లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండలంలో 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొదట్లో మండలంలోని విద్యార్థులంతా నందిమండలం ఉన్నత పాఠశాల పరీక్షకేంద్రంగా పరీక్షలు రాసేవారు. ఐతే విద్యార్థుల సంఖ్య పెరిగే కొద్ది పరీక్షకేంద్రాలను వెల్లటూరు, పెండ్లిమర్రి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. 2023-24 విద్యాసంవత్సరం కూడా చౌటపల్లె, జీసీపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థులు, నందిమండలం పాఠశాల విద్యార్థులతో కలసి ఇక్కడే పరీక్షలు రాశారు. కానీ ఈనెల 17వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పరీక్షా కేంద్రాన్ని రద్దు చేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాల అన్ని గ్రామాలకు సెంటర్ కావడంతో విద్యార్థులకు అనుకూలంగా ఉండేది. పరీక్షా కేంద్రాన్ని ఉన్నపళంగా రద్దు చేయడం అన్యాయమని, విద్యాశాఖ అధికారులు కనీసం పత్రికాముఖంగా కూడా తెలపకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం దారుణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నందిమండలం ఉన్నత పాఠశాలలోనే పరీక్షకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పోలీసుస్టేషన్‌కు దూరంగా ఉండటంతో..

పోలీసు స్టేషన్‌కు దూరంగా ఉన్న పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఇక్కడ మాత్రమే కాదు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇలాంటి కేంద్రాలను గుర్తించి రద్దు చేశారు.

- సుజాత, మండల విద్యాశాఖ అధికారి

లక్ష్మీనారసింహుడి కల్యాణం..

లోకాలకే వైభోగం..



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారసింహుడి కల్యాణం.. లోకాలకే వైభోగం అన్నట్లుగా స్వామివారి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య వైభవంగా నిర్వహించారు. మాచిరెడ్డిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామివారికి వివిధ పూజలు, హోమాలు, అభిషేకాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. అనంతరం మూలవిరాట్‌లను అలంకరించి కళ్యాణవేదికపై ఆశీనులు చేశారు. పుత్తా కుటుంబీకులతో కన్యాదానం చేయించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణ తంతును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహస్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారి కల్యాణఘట్టాన్ని వీక్షించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఎస్పీని శాలువాతో సత్కరించారు. అనంతరం మధ్యాహ్నం అన్నసంతర్పణ చేశారు. అలాగే వృషభరాజముల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. నాలుగురోజులుగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీల విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పుత్తా నరసింహారెడ్డి భార్య సరళమ్మ, ఎమ్మెల్యే సతీమణి చైతన్యరెడ్డి, పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి, ఆయన భార్య వెంకటసుబ్బమ్మ, యువనేత సాయి నరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పుష్పగిరి గిరిప్రదర్శనతో పుణ్యఫలితం

● అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్



గిరిప్రదక్షిణకు ముందు గోపూజ చేస్తున్న దృశ్యం

వల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి గిరి ప్రదక్షిణ చేయడం వల్ల పుణ్యఫలితం లభిస్తుందని దేవదాయ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆయన గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ గోపూజ కార్యక్రమంతో ప్రారంభమవుతుందన్నారు. గిరిప్రదక్షిణ సంపూర్ణంగా దేవదాయశాఖ, ఆలయ అనువంశిక ధర్మకర్త సమక్షంలో కొండ చుట్టూ గ్రామ సేవా కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో జరుగుతుందన్నారు. ముందుగా లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతనంగా గిరిప్రదక్షిణ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, బసిరెడ్డి భక్తులు ఉచిత వాహన సదుపాయం ఏర్పాటు చేశారు.

అల్లర్లు చేసినా.. గొడవలు సృష్టించినా కఠిన చర్యలే

● డీఎస్పీ వెంకటేశ్వర్లు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా ఎవరు నడుచుకున్నా, అల్లర్లు చేసినా, గొడవలు సృష్టించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించడంతో పాటు కేసులు, ఇటీవల జరిగిన సంఘటనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జాతరలు, పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహిస్తుంటారని, అలా జరిగే సమయంలో ఎవరైనా గొడవలకు దిగి, ఇబ్బందులు కలిగిస్తే వారిపై తీవ్ర చర్యలుంటాయన్నారు. కొన్ని అల్లరి మూకలు అదేపనిగా గొడవలకు మూలం అవుతున్నాయని, వాటిపై పోలీసులు అలర్ట్‌గా ఉండి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాటర్ గండి, పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె ఆనకట్టలాంటి ప్రాంతాల్లో ఆదివారం, సెలవు దినాల్లో బోర్డులు చూసి నీటిలో దిగకుండా జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. అలాగే చెన్నూరు క్రాసింగ్ నుంచి కొండపేట రోడ్డు వరకు రోడ్డులో ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలన్నారు. రంజాన్ తరువాత ఈ విషయంపై దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా తొలగింపులు చేపడతామన్నారు. అలాగే ఇసుక, బియ్యం అక్రమ రవాణా జరగకుండా నిరంతరం నిఘా పెంచాలని సీఐ పురుషోత్తంరాజుకు సూచించారు.

వంకలతో ప్రమాదం

● వర్షాకాలంలో ఆ గ్రామాలు జలదిగ్బంధమే
● బాహ్యప్రపంచంతో సంబంధం కట్
● నేటికీ శివాలపల్లె, రాచిన్నాయపల్లె, ముండ్లపల్లె, రామనపల్లెలో ఇదే పరిస్థితి..
● పట్టించుకోని పాలకులు


చెన్నూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎవరికైనా ప్రాణాపాయ పరిస్థితి వస్తే ఎటు వెళ్లాలన్నా చుట్టూ నీరే.. వంకలపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలపై వంకలు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. దీంతో వంకలు దాటలేని పరిస్థితి, గ్రామంలో వైద్యం లేని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లోనే మండలంలోని శివాలపల్లె, రాచిన్నాయపల్లె, రామనపల్లె, ముండ్లపల్లె ఉన్నాయి. ఈ గ్రామాలు వంకలతో ముప్పు తప్పించలేకున్నాయి. ఒక్కోమారు రోజుల తరబడి రాకపోకలు చేయలేని పరిస్థితి. ఈ సమస్యల నుండి గట్టెక్కించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా నాయకులు స్పందించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా వంకల గురించి పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. నేటికీ ఒక్క వంకపై చిన్నపాటి హైలెవల్ వంతెన కూడా ఏర్పాటు చేయలేదంటే ప్రజలపై ఎంత నిర్లక్ష్యమోనని ఆవేదన చెందుతున్నారు.

ముండ్లపల్లె-రామనపల్లె పరిస్థితి

ముండ్లపల్లె గ్రామ సమీపంలో ఓబులంపల్లె వెళ్లే దారిలో ఉన్న ఉప్పువంక వర్షాకాలం ఉధృతంగా ప్రవహిస్తుంది. ఏమరుపాటుగా అందులో అడుగుపెడితే గల్లంతు కావాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వంకపై ఉన్న చిన్నపాటి లోలెవల్ కాజ్‌వేను మరో 5 అడుగుల ఎత్తు పెంచితే సమస్య ఉండదని ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే చెన్నూరు నుండి రామనపల్లె వచ్చే వంక పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఎన్నో మార్లు ఎడ్లు, ఎనుములు, ద్విచక్ర వాహనదారులు ఈ వంకలో పడిపోయారు. లోలెవల్ కాజ్‌వేను ఎత్తు పెంచాలని ఏళ్ల తరబడి అడుగుతున్నా పట్టించుకునేవారు లేరని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

జింకల వంక పొంగితే..

మంచి రైతులు, ఉన్నత విద్యావంతులు ఉన్న గ్రామం శివాలపల్లె. కానీ ఆ ఊరికి పక్కనే ఉన్న జింకల వంక పొంగితే తగ్గేంత వరకు వారు మండల కేంద్రానికి రాలేరు. వచ్చే అవకాశం లేదు. దాటడానికి చిన్న కాజ్‌వే కూడా లేదు. ఒకవేళ రావాలంటే దాదాపు పది, పన్నెండు కిలోమీటర్లు చుట్టి రావాల్సిందే. మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే మండల కేంద్రానికి రావాలంటే ఈ ప్రయాస ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



శివాలపల్లె వద్ద జింకల వంకపై ఉన్న లోలెవల్ కాజ్‌వే

రాళ్ల వంకతో రాచిన్నాయపల్లెకు ముప్పు

రాచిన్నాయపల్లె సమీపంలోని రాళ్లవంక ప్రతి ఏటా వర్షానికి పెద్ద నదిలా ప్రవహిస్తుంది. దీంతో ఇక్కడ ఉన్న లోలెవల్ కాజ్‌వే దాటడం వీలుకాదు. ఫలితంగా కడప నగరానికి రామనపల్లె, చిన్నమాచుపల్లె మీదుగా సుమారు 10 కి.మీ తిరిగి వెళ్లాల్సిందే. కళ్లముందు కనిపించే నగరానికి వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదని ప్రజలు బాధపడుతున్నారు. వంకపై హైలెవల్ కాజ్‌వే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



రాచిన్నాయపల్లె సమీపంలో రాళ్ల వంకపై లోలెవల్ కాజ్‌వే

మా సమస్య తీర్చండి..



ఎన్నో ఏళ్లుగా జింకల వంకతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం మా పరిస్థితి మరీ దారుణం. వంకకు నీరు వచ్చిందంటే బయటికి వెళ్లలేని పరిస్థితి, బిక్కుబిక్కుమంటూ కూర్చోవాల్సిందే. పాలకులు స్పందించి ఈ వంకపై హైలెవెల్ కాజ్‌వే ఏర్పాటు చేయాలి.

- సుంకేసుల శ్రీనివాసులు, శివాలపల్లె

ప్రమాదాలు లేకుండా చూడాలి..



ముండ్లపల్లె వంక వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా వంకలపై హైలెవెల్ కాజ్‌వేలు ఏర్పాటు చేస్తే వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- యామల మణికంఠ, ముండ్లపల్లె

సబ్‌జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు

మొదటిరోజు హోరాహోరీ

● తలపడనున్న 13 జిల్లాల జట్లు ● క్రీడారంగం బలోపేతానికి కృషి : ఎమ్మెల్సీ



పోటీలకు హాజరైన 13జిల్లాల కబడ్డీ జట్లు

పులివెందుల రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో మూడు రోజుల పాటు జరిగే 34వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమ య్యాయి. స్థానిక వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో ఎమ్మెల్సీ రామగో పాల్‌రెడ్డి, పులివెందుల ఆర్డీవో చెన్నయ్య ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను, కబడ్డీ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ కేడట్లు 13 జిల్లాల క్రీడాకారులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. పీపీపీ విధానాన్ని అమలు చేసి విద్యాసంస్థలలో ప్రతి వంద సీట్లలో మూడు సీట్లు క్రీడాకారులకు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, మాజీ డీఎస్‌పీ రామచంద్రారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గురుశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ట్రెజరర్ కొండయ్య, కోచ్ శ్రీధర్, ఇన్‌చార్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన పోటీలు

పులివెందులలో జరిగిన అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బాయ్స్ విభాగంలో కడప, విశాఖపట్టణం తలపడగా కడప 26పాయింట్లతో గెలిచింది. అలాగే కృష్ణా, నెల్లూరు మధ్య జరిగిన పోటీలో కృష్ణా.. అనంతపురం, చిత్తూరు మధ్య జరిగిన పోటీలో చిత్తూరు.. విశాఖపట్టణం, విజయనగరం మధ్య జరిగిన పోటీలో విజయనగరం గెలిచాయి. అలాగే గర్ల్స్ విభాగంలో కడప, ఈస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీలో కడప.. నెల్లూరు, వెస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీలో వెస్ట్‌గోదావరి.. విశాఖపట్టణం, చిత్తూరు మధ్య జరిగిన పోటీలో విశాఖపట్టణం.. కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా జట్టు విజేతలుగా నిలిచాయి.

విద్యార్థిని ఆత్మహత్య



మృతి చెందిన అక్షయ

జమ్మలమడుగు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో శుక్రవారం మధ్యాహ్నం అక్షయ (18) అనే విద్యార్థిని విషద్రావణం తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా సిబ్బంది, స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాంబెల్ వైద్యశాలకు తరలించగా రాత్రి 8.30 గంటల సమయంలో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆ వివరాల్లోకి వెళితే.. పెద్దముడియం మండలం కొండసుంకేసులకు చెందిన అక్షయ జమ్మలమడుగు నాగులకట్ట వీధిలోని ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. వసతి గృహంలోని ఇతర విద్యార్థినులతో మనస్పర్థలు రావడంతో విరక్తి చెంది విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుందని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఘటన జరిగిన వెంటనే అర్బన్ సీఐ, ఏఎస్‌డబ్ల్యూ గురుప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి పరిశీలించారు. విషయం తెలిసిన వెంటనే పట్టణంలోని విద్యార్థి సంఘాలు, టీఎన్ఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, సీపీఐ నాయకులు వసతి గృహంలో జరిగే సమస్యలపై ఏఎస్‌డబ్ల్యూతో మాట్లాడారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఒక్కగానొక్క కూతురు చనిపోవడంతో విద్యార్థిని తల్లి పద్మావతి బోరున విలపించింది. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట విద్యార్థి సంఘ నాయకులతో పాటు ఆమె ఆందోళనకు దిగారు.


చికెన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ1.80.లక్షల ఆస్తినష్టం

ఎర్రగుంట్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం చిలమకూరులోని ముద్దనూరు రోడ్డులో నరేష్‌కుమార్(బుజ్జి)కి చెందిన చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.1.80లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి 9గంటలకు చికెన్ సెంటర్‌ను మూసివేశానని, తెల్లవారుజామున 2.40గంటలకు షాపు, కోళ్లు కాలిపోతున్నాయని ఫోన్‌వచ్చిందని తెలిపాడు. ఈ ప్రమాదంలో 70 కోళ్లు, రెండు కాటా మిషన్‌లు, టేబుల్ ఫ్యాన్, నాలుగు కుర్చీలు, రూ.1.70 అప్పులపట్టీ, రెండు సిలిండర్స్, విద్యుత్ మీటర్ కాలిబూడిదయ్యాయని వాపోయాడు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందో తెలియడంలేదని, సుమారు రూ.1.80లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందన్నాడు.

శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

● జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నకొట్టి చంద్ర

కడప రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేయాలని ఆ సంఘం ఉమ్మడి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నకొట్టి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో శారీరక దివ్యాంగ ఉద్యోగుల (అన్నీ ప్రభుత్వశాఖలు) సంక్షేమ సంఘం ఉమ్మడి కడప జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డి.మల్లయ్య నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. సంఘం నూతన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనతో పాటు గౌరవ అధ్యక్షుడుగా బి.సుధాకర్, జిల్లా అధ్యక్షుడుగా పులిమి జేమ్స్, జిల్లా ట్రెజరర్‌గా బత్తుల చంద్రశేఖర్, జిల్లా సమాచార కార్యదర్శిగా పి. సుబ్బరాజు, జిల్లా కార్యదర్శులుగా వై. గుర్రప్ప, హెచ్. నరసింహులు, జిల్లా కన్వీనర్‌గా యం. రవిశంకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాలోని శారీరక దివ్యాంగ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వృద్ధుడు మృతి

ముద్దనూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బీంచర్ల శివారెడ్డి (91) రైలు కింద పడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైల్వే ఎస్ఐ సమాచారం మేరకు.. బీంచర్ల శివారెడ్డి సొంత గ్రామం కొర్రపాడు. 10 సంవత్సరాల నుంచి ప్రొద్దుటూరులోని దొరసానిపల్లెలో నివాసం ఉంటున్నారు. మతిస్థిమితంలేని కారణంగా కొర్రపాడుకు వచ్చి రైలు కింద పడి మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

'ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

రాజంపేట టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం మండల కమిటీ నాయకులు రామ్‌చరణ్, సాదిక్, పృథ్వీ, హేమంత్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన హోలీ సంబరాలు



రైల్వేకోడూరులో సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

రైల్వేకోడూరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో శుక్రవారం హోళీ పండుగ సంబరాలు అంబరాన్నంటాయి. చిన్నలు, పెద్దలు అనే తేడా లేకుండా రంగులు చల్లుకుని సంబరాలు జరుపుకున్నారు. అలాగే ప్రతి వీధిలోను చిన్న పిల్లలు వివిధ రకాల రంగులు చల్లుకుని పండుగ చేసుకున్నారు. మార్వాడీలు మాట్లాడుతూ ప్రధానంగా ఆనందం కోసమే హోళీ పండుగను జరుపుకుంటున్నారని తెలిపారు.

నందలూరు: నందలూరు రైల్వేకేంద్రంలో రైల్వే కార్మికులు ఘనంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఒకరినొకరు రంగులు పూసుకుంటూ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా ఉల్లాసంగా పండుగ చేసుకున్నారు. మహిళలు వారి గృహాల్లో ఉదయాన్నే లేచి వివి రకాల పిండివంటలు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి పండుగ చేసుకున్నారు. పిల్లలు సైతం ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగను నిర్వహించుకున్నారు. చీఫ్ లోకో ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

రామాపురం: హోలీ పండుగ ప్రజల జీవితాలను సప్తవర్ణ శోభితం చేయాలని గాలివీటి సురేంద్రారెడ్డి, మార్చురీ చెన్నకృష్ణారెడ్డి, నాగిరెడ్డి, దేవదర్శన్‌రెడ్డి ఆకాంక్షించారు. హోళీ పండుగ ప్రజల జీవితాల్లో సంతోషం నింపాలన్నారు.



నందలూరులో హోలీ సంబరాలు జరుపుకుంటున్న రైల్వే కార్మికులు

నాటుసారా నిర్మూలనే లక్ష్యం



తులసి, సీఐ, ఎక్సైజ్‌శాఖ, రైల్వేకోడూరు

రైల్వేకోడూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా పని చేస్తున్నామని రైల్వేకోడూరు ఎక్సైజ్‌శాఖ సీఐ తులసి వివరించారు. నాటు సారా విక్రేతలపై కేసులు బనాయించామని, బెల్టు దుకాణాలపై దాడులు చేస్తున్నామని, బైండోవర్ చేశామని పేర్కొన్నారు.

ప్రశ్న: నాటుసారా నిర్మూలనకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రజల్లో మార్పు తీసుకు వచ్చేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఏ గ్రామంలో కూడా నాటు సారా కనిపించకుండా చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజు నిఘా చేపడుతున్నాం. ప్రజలు సహకరించి తమకు వివరాలు అందిస్తే చర్యలు తీసుకుని నాటుసారా తయారీ లేకుండా చేస్తాం.

ప్రశ్న: నాటు సారా కేసులు ఎన్ని నమోదు చేశారు?

జవాబు: ఎనిమిది కేసులు నమోదు చేశాం. ఇద్దర్ని అరెస్టు చేశాం. ఏడు లీటర్ల నాటుసారాను పట్టుకుని, 1040 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశాం.

ప్రశ్న: రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి మండలాల్లో బెల్టు ఉందా?

జవాబు: మూడు మండలాల్లో బెల్టు లేదు. 20 బెల్టు దుకాణాలపై కేసులు నమోదు చేసి, 20 మందిని అరెస్టు చేశాం. 52.74 లీటర్ల బెల్టు మద్యంను స్వాధీనం చేసుకున్నాం.

ప్రశ్న: రైల్వేకోడూరులో కల్తీ మద్యం ఉందా?

జవాబు: కల్తీ మద్యం సరఫరా చేసే ముఠాను పట్టుకుని ఇందులో 13 మందిని అరెస్టు చేశాం. 284 లీటర్ల కల్తీ మద్యం స్వాధీనం చేసుకున్నాం. 805 లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నాం. మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నాం.

ప్రశ్న: మూడు మండలాల్లో మద్యం దుకాణాల రికార్డులు పరిశీలిస్తున్నారా?

జవాబు: ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి రికార్డులు పరిశీలిస్తున్నాం.మద్యం దుకాణాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పరిశీలించి యజమానులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

ప్రశ్న: బెల్లం అమ్మకాలపై ఎలాంటి నిర్ణయాలు తీసుకున్నారు?

జవాబు: బెల్లం అమ్మకాలు చేసే వారు ఖచ్చితంగా ఎవరికి ఇస్తున్నారు, ఎంత ఇస్తున్నారు అనేది ఖచ్చితంగా రికార్డు రాయాలి. లేకపోతే చర్యలు తీసుకుంటాం. నల్లబెల్లం నాటుసారాకు ఉపయోగించే వారు. ప్రస్తుతం తెల్ల బెల్లం కూడా ఉపయోగిస్తున్నారని సమాచారం రావడంతో నిఘా పెట్టాం. వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేయిస్తాం.

అంగరంగ వైభవంగా మల్లూరమ్మ జాతర

చిన్నమండెం, మార్చి14(ఆంధ్రజ్యోతి): మాండవ్యనది ఒడ్డున వెలిసిన మల్లూరమ్మ జాతర మహోత్సవం కన్నుల పండుగగా సాగింది. దాదాపు 20 చాందినీ బండ్లను కట్టారు.

చాందినీ బండ్లను ప్రారంభించిన మంత్రి మండిపల్లి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చాందినీ బండ్లకు ప్రారంభించారు. జబర్దస్త్ ప్రోగ్రాం, చెక్కల భజన కార్యక్రమాన్ని సైతం మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు.

చౌడేశ్వరి విగ్రహావిష్కరణలో మంత్రి

రాయచోటిటౌన్: శిబ్యాల గ్రామం తొగటపల్లెలో నిర్మించిన చౌడేశ్వరి దేవి ఆలయంలోజరిగిన విగ్రహావిష్కణలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మాజీ జెడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, టీడీపీ నాయకులు సుబ్బరామయ్య, వెంకటేశ్, జయరామరాజు, సుబ్బయ్యనాయుడు, బసయ్య పాల్గొన్నారు.

చాందినీ బండిని ప్రారంభించిన సుగవాసి ప్రసాద్‌బాబు

మల్లూరమ్మ జాతర సందర్భంగా బెల్లంవాండ్లపల్లెలో భయ్యారెడ్డి కట్టిన చాందినీ బండ్లను రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు కొబ్బరికాయ కొట్టి ఎద్దుల బండిని ప్రారంభించారు. అనంతరం సుగవాసి ప్రసాద్‌బాబు చాకిబండపల్లెలో రెడ్డయ్య చాందినీ బండిని ప్రారంభించారు.





చాందినీ బండిని ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి... ఎద్దుల బండి నడుపుతున్న సుగవాసి ప్రసాద్‌బాబు

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం



పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న జనసేన, టీడీపీ నాయకులు

సుండుపల్లె, మార్చి14(ఆంధ్రజ్యోతి): సుండుపల్లెలో శుక్రవారం జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన సీనియర్ నాయకుడు రామా శ్రీనివాసులు మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్ ఆశయ సాధకుడు అని కొనియాడారు.జనసేన నాయకులు సలీం, ఓబులేసు, టీడీపీ సీనియర్ నాయకులు చెన్నంశెట్టి వెంకట్రమణ, బీసీ నాయకులు రమణ, కృష్ణారెడ్డి, చెరువు నీటి సంఘం అధ్యక్షులు ఆనందరెడ్డి పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించిన మంత్రి

రాయచోటి(కలెక్టరేట్), మార్చి14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఏపీయూడబ్ల్యూజే డైరీని ఆవిష్కరించారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గౌనుపల్లి శ్రీనివాస్, నగలపాటి సూర్యప్రకాశ్‌రాజు, కృష్ణయ్య, ఈశ్వరయ్య, మునయ్య, ప్రవీణ్‌కుమార్, ఆంజనేయులు, మురళి, నారాయణ, కుమార్, పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా వారు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

సుండుపల్లె, మార్చి14(ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. ఎముకల వైద్య నిపుణుల విజయ్ కుమార్, జనరల్ ఫిజీషియన్ వరుణ్, గుండె వైద్య నిపుణుడు మహమ్మద్‌నౌషాద్ వైద్యం అందించారు.

శాన్వి విద్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం



మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు తదితరులు

రాజంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):రాజంపేట మండలం తాళ్లపాక ముఖద్వారం వద్దనున్న శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్లో ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా వారి ఆర్థిక సహాయంతో ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ కరస్పాండెంట్ కొండూరు శరత్‌కుమార్‌రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉచిత వైద్యశిబిరంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్ అమెరికా వారు అనేక గ్రామాలను దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేయడం, ఉచిత కంటి వైద్య శిబిరాలు, ఇతరత్ర కార్యక్రమాలు చేయడం ఆనందాయకమన్నారు. ఈ సందర్భంగా అనేక మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహిచారు.

'విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలి'



రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

రాజంపేట, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రుల హక్కు విశాఖ కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయరాదని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, సీపీఐ జాయింట్ సెక్రటరి మహేష్, భవన నిర్మాణం సంఘం జిల్లా అధ్యక్షుడు గాలిచంద్ర, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సికిందర్ పాల్గొన్నారు.

నేడు పశువుల సంత బహిరంగ వేలం

రామాపురం, మార్చి14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వారాంతపు శనివారం నిర్వహించే పశువుల సంత 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ గేటు వేలం శనివారం సాయంత్రం 3 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ కార్యదర్శి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు నల్లగుట్టపల్లి సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి తెలిపారన్నారు. ఆదేశాల మేరకు పాటలో పాల్గొనదలచిన వారు గ్రామ పంచాయతీకి ఎలాంటి బాకీ ఉండరాదని, రూ.2.50 లక్షల గేటు, రూ.50 వేలు సాల్వెన్సీ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు. పశువుల సంత వేలం పాటదారుడు రూ.50 వేలు, గేటు వేలం పాట దారుడు రూ.30 వేదు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు. పాట నిలిపిన వెంటనే పాడిన మొత్తం అక్కడే చెల్లించాలని వివరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ఎస్ఐ



గాలివీడులో ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ రామక్రిష్ణ

గాలివీడు, మార్చి14(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ రామక్రిష్ణ సూచించారు. మండల కేంద్రంలోని పశువుల సంత ఆవరణంలో శుక్రవారం ఆటో డ్రైవర్లు, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మద్యం సేవించి, మొబైల్ ఫోన్ వినియోగిస్తూ డ్రైవింగ్ చేయరాదన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డు అందజేత



సభ్యత్వ కార్డులు పంపిణీ చేస్తున్న సుబ్బరాయుడు

రామాపురం, మార్చి14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్టలపల్లి గ్రామంలోని 50వ భూత్ నెంబర్‌లో ఉన్న టీడీపీ కార్యకర్తలకు శుక్రవారం భూత్ ఇన్‌చార్జి గంప సుబ్బరాయుడు ఆధ్వర్యంలో సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని సభ్యత్వం తీసుకున్న వారు తెలిపారు.

ఉద్యోగులకు అండగా ప్రభుత్వం

రాయచోటిటౌన్,మార్చి14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఏపీ ఎన్జీవో సం ఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై. ప్రసాద్‌యాదవ్, రాయచోటి తాలూకా అధ్యక్షు డు వెంకటేశ్వర్‌రెడ్డి, హౌస్ బిల్డింగ్ సొ సైటీ మాజీ అధ్యక్షుడు జయచంద్ర ఆధ్వర్యంలో ఎన్జీవో సంఘం రాయచోటి నూతన కార్యవర్గం మంత్రిని కలిసి సత్కరించారు.

వరిగ పాపిరెడ్డిగారిపల్లె సర్పంచ్ మృతి


రాయచోటిటౌన్, మార్చి14(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె సర్పంచ్ కసిరెడ్డి సుబ్బలక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శు క్రవారం మృతి చెందారు. వైసీపీ రాష్ట్ర ప్ర ధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి నివాళులర్పించారు. సుబ్బలక్ష్మమ్మ సేవలు మరువలేనివని శ్రీకాంత్‌రెడ్డి అన్నారు.మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

లక్కిరెడ్డిపల్లె, మార్చి 14(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెకు చెందిన పేద విద్యార్థి వెంకటచరణ్‌కు మనం ఎస్ఎస్‌సీ సేవాసంస్థ ఫౌండేషన్ అధినేత యోగాంజనేయరెడ్డి శుక్రవారం రూ.50 వేల చెక్కును అందజేశారు. ఆ విద్యార్థి తండ్రి రామాంజనేయులు లాయర్ వద్ద సహాయకుడిగా పనిచేస్తూ ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరి చదువులు తల్లికి భారం కావడంతో దాతలు ముందుకువచ్చి ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు.

సుండుపల్లె : సుండుపల్లె మండలంలోని చిన్నగొల్లపల్లి గ్రా మ పంచాయతీ పూజారివాండ్లపల్లెలో వెలిసిన చింతకుంటమ్మ తిరుణాల సందర్భంగా వైసీపీ నాయకుడు విజయసాగర్‌రెడ్డి రూ.19, 500, చిన్నగొల్లపల్లి సర్పంచ్ రామజయచంద్ర రూ.2500 నగదు అందజేసినట్లు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామజయచంద్ర పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు ఇచ్చిన ఎస్ఐ



లక్కిరెడ్డిపల్లె, మార్చి 14(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లెలోని పెద్ద మసీదులో శుక్రవారం ఎస్ఐ రవీంద్ర ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. అనంతరం మా ట్లాడుతూ ముస్లింలకు రంజాన్ మాసం చాలా పవిత్రమైనదన్నారు. మత పెద్దలు ముజామల్లి చాన్‌బాషా, సాదుల్లా, సర్కాజీ ముక్తార్ అహ్మద్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతం




రాజంపేట టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలోని సాయినగర్ సాయిబాబా ఆలయంలో పౌర్ణమి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం శుక్రవారం ఆలయ కమిటీవారు నిర్వహించారు. సామూహిక సత్యనారాయణ వ్రతంలో ప ట్టణ, వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారి కథలను వివరించి సత్యనిరతిని తెలిపారు. వ్రతంలో ప్రధాన అర్చకులు సత్యస్వామి, నిర్వాహకులు శివరాజు, కృష్ణమూర్తి, ధనుంజయ, న్యాయవాది, రఘునాథ్‌రెడ్డి, కొండయ్య, సుబ్బరామిరెడ్డి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రాయలసీమ మాల సింహ గర్జనను విజయవంతం చేయండి

రాజంపేట టౌన్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మాలల హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 23న తిరుపతి వేదికగా నిర్వహించే రాయలసీమ మాలల సింహగర్జనను విజయంతం చేయాలని శుక్రవారం రాయలసీమ మాలల జేఏసీ అధ్యక్షుడు యామల సుదర్శన్, ఉపాధ్యక్షుడు జేవీ రమణ పిలుపునిచ్చారు. కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు జస్టిస్, ఏడుగురు న్యాయవాదులతో ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ప్రభాకర్, లింగం సంజీవ్, ధనశేఖర్, మల్లికార్జున, చిరంజీవి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలి: డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు

చిన్నమండెం, మార్చి14(ఆంధ్రజ్యోతి): కేశాపురం పాలేటమ్మ జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని రాయచోటి డీఎస్పీ కొండయ్యనాయుడు సూచించారు. శుక్రవారం రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామస్థులు హిందూ-ముస్లిం మత పెద్దలతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. అల్లర్లకు పాల్పడితే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీడీవో శేఖర్‌నాయక్, అధికారులు, ప్రజలు పోలీసులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

రాయచోటిటౌన్, మార్చి14 (ఆంధ్రజ్యోతి):స్కౌట్ అండ్ గైడ్స్ (బాలభటు లు) విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని ప్రపంచ స్థాయి పౌరులుగా ఎదగాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మడితాటి నరసింహారెడ్డి అన్నారు. రాయచోటి పట్టణ పరిధిలోని గాలివీడు రోడ్డులో గల అర్చన కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ గల అర్చన కళాశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులకు ఈ నెల 10 నుంచి నేటి వరకు 5 రోజుల పాటు నిర్వహించిన పెట్రోల్ లీడర్స్ శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎంపికైన 36 పీఎంశ్రీ పాఠశాలల నుంచి వచ్చిన 272 మంది విద్యార్థులకు స్కౌటిజంపై శిక్షణ ఇచ్చామన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏఎస్‌వోసీ లక్ష్మీకర్, హెచ్‌డబ్ల్యూబీ నిర్మల, స్కౌట్ మాస్టర్‌లు మార్ల ఓబుల్‌రెడ్డి, నాగరాజ, గైడ్ కెప్టెన్లు సుజాత, గోవిందమ్మ, స్వర్ణలత, స్కౌట్ అండ్ గైడ్స్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

గాలివీడు, మార్చి14(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి-1 చక్రేనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గాలివీడు మండల కేంద్రంలో 3 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 540 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కేంద్రంలో 210 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానుండగా చీఫ్ సూపరిండెంట్ సుబ్బరాయుడు, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా మనోహర్, అలాగే జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా చీఫ్ సూపరిండెంట్‌గా దుర్గేశ్వర్‌రాజు, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా రామాంజనేయులు, జిల్లా పరిషత్ ఉర్దూ హైస్కూల్‌లో 130 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా చీఫ్ సూపరిండెంట్‌గా చిన్నరెడ్డెప్ప, డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా జాఫరుద్దీన్ విధులు నిర్వహించనున్నారు.

వైభవంగా సీతారామ లక్ష్మణుల గ్రామోత్సవం



నందలూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల గొల్లపల్లెలో నిర్మించిన రామాలయంలో శుక్రవారం రాముడు, లక్ష్మణుడు, సీతా, వినాయకుడు, శ్రీకృష్ణుని విగ్రహాల గ్రామోత్సవం నిర్వహించారు. వేదపండితులు బండత్మాకూరు శివకుమార్‌శర్మ అధ్యక్షతన ఆవాహిత పూజలు, యంత్రాభిషేకాలు, సూక్త వాహనంలు, అరుణ హోమం, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.


సభ వద్ద నాగబాబు భార్య


సభకు కదలివచ్చిన అశేష ప్రజానీకం..అభివాదం చేస్తున్న పవన్


మేం సైతం: సభకు కదలివచ్చిన దివ్యాంగులు

జనషోన

పవనుడు అందరివాడు..



పవన్ అభిమానం

పిఠాపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : పవన్ సభకు ఎక్కడెక్కడి నుంచో అభిమానులు తరలివస్తారు. దానికి తగినట్టు ఏర్పాట్లు కూడా చేశారు. ఇతర రాష్ట్రాల నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానుల కోసం ఆయా భాషల్లో బోర్డులు ఏర్పాటు చేశారు. జయకేతనం అంటూ తమిళం, కన్నడ, హిందీ తదితర భాషల్లో ఏర్పాటు చేసిన బోర్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభ వద్ద కర్నాటక రాష్ట్రానికి చెందిన జన సైనికులు కన్నడ భాషలో రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శించారు.


పచ్చని స్వాగతం..



పర్యావరణ ప్రాధాన్యతను వివరిస్తూ కాకినాడ సర్పవరం జంక్షన్ నుంచి చిత్రాడ వరకూ పచ్చని స్వాగతద్వారాలు ఏర్పాటు చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని వర్గాలకు మేలు చేసే పలు కార్యక్రమాలు నిర్వహించిన విశిష్ట వ్యక్తులు పిఠాపురం మహారాజా సూర్యారావు బహదూర్, మల్లాడి సత్యలింగ నాయకర్, డొక్కా సీతమ్మ పేర్లను స్వాగత ద్వారాలకు పెట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

9 చోట్లా ఇంతే

చిత్రాడలో నిర్వహించిన జయకేతనం సభకు సంబంధించి 9 ప్రాంతాల్లో పార్కింగ్ ప్రదేశాలు కేటాయించారు. ప్రతి చోటా వాహనాలన్నీ ఇలా బారులుతీరాయి. బస్‌లు, కార్లు, ద్విచక్రవాహనాలతో ఎక్కడికక్కడ నిండిపోయాయి.



జయకేతనం.. విజయకేతనమే.. యువత ఉప్పొంగింది.. చిత్రాడను ముంచెత్తింది.. ఎటు చూసినా ఎక్కడ చూసినా జనమే జనం.. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ వీధులన్నీ జనంతో నిండిపోయాయి.. జై పవన్.. జై జై పవన్ నినాదాలతో మార్మోగిపోయాయి.. డిప్యూటీ సీఎం.. పిఠాపురం ఎమ్మెల్యేగారి తాలూకా బైక్‌లతో నిండిపోయాయి.. కార్లు.. ఆటోలు.. బస్‌లు క్యూకట్టాయి.. రకరకాల విన్యాసాలు చేసుకుంటూ జనసైన్యం కదిలింది.. పవన్‌పై అభిమానం చాటింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే జనసైనికులు తరలిరావడం ఆరంభించారు.. ఆలస్యంగా వెళితే అన్నను వెనుక నుంచి చూడాలని ముందుగానే జయకేతనం సభ నిర్వహించే చిత్రాడకు చేరుకున్నారు.. లక్షలాది మందితో గ్రామం కిక్కిరిసిపోయింది..

మొక్కు తీరుద్దామని..



పిఠాపురం : 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ విజయం సాధిస్తే వైజాగ్‌లోని కనకమహాలక్ష్మి.. తిరుమల వెంకటేశ్వరస్వామి.. హైదరాబాద్‌లోని పెద్దమ్మతల్లి గుడికి వస్తానని అనకాపల్లి జిల్లా పాయకరావుపేటకు చెందిన జనసైనికుడు గుత్తుర్తి విజయబాబు మొక్కుకున్నాడు. సైకిల్‌పై మొక్కు తీర్చుకునేందుకు తిరుపతికి బయలుదేరి చిత్రాడలో జరుగుతున్న జనసేన సభ వద్దకు వచ్చారు. సభ చూసిన తర్వాత తిరుమలకు సైకిల్‌పై వెళతానని విజయబాబు తెలిపారు.


చిత్రాడదారులన్నీ జనపవనమై..

జనసైనికా.. కూల్..కూల్..



పిఠాపురం,/కాకినాడ కలెక్టరేట్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : రండి బాబు రండి పుచ్చకాయలు తిని వెళ్లండి.. లేదంటే మజ్జిగ తాగి వెళ్లండి.. ఏదైనా మీ చాయిస్ అంటూ దారి పొడవునా జనసైనికులను చల్లబరిచారు.. చిత్రాడ జనసేన ఆవిర్భావ సభకు అటు, ఇటూ పది కిలోమీటర్ల దూరం వరకూ ఎక్కడిక్కడ ఏర్పాటు చేసిన ఉచిత కౌంటర్ల ద్వారా ఉదయం నుంచి రాత్రి వరకూ పిలిచి మరీ అందించారు. మజ్జిగ ప్యాకెట్లతో పాటు వాటర్ ప్యాకెట్లు భారీ ఎత్తున పంపిణీ చేశారు.

పాము కాటుతో రెండేళ్ల చిన్నారి మృతి


అమృతసాగర్ (ఫైల్‌ఫొటో)

నిమ్మనపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాముకాటుతో రెండేళ్ల చిన్నారి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీకి చెందిన పద్మనాభం,సుభాషిణీల కుమారడు నీరుగిట్టి అమృతసాగర్(2) జాతర చూసేందుకు గురువారం తన తల్లిదండ్రులతో కలసి చౌడేపల్లికి వెళ్లాడు. ఈ క్రమంలో రాత్రి 7గంటల సమయంలో తన అమ్మమ్మ ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా పాటుకాటుకు గురయ్యాడు. గమనించిన తండ్రిదండ్రులు వెంటనే అమృతసాగర్‌ను చౌడేపల్లి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు ఆలస్యంగా స్పందించడంతో, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి డాక్టర్లు పరీక్షచేసి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరునవిపించారు. కాగా తల్లి పద్మావతి సోమల మండలంలో లెక్చరర్‌గా పని చేస్తుండగా తండ్రి పద్మానాభం నిమ్మనపల్లి ఎమ్మార్‌సీలో సీఆర్పీగా పని చేస్తున్నాడు. చిన్నారిమృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

గిరిజన మహిళపై వైసీపీ నేత బంధువు దాడి


మీడియాతో మాట్లాడుతున్న సునీత

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఇనుప రాడ్డుతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన వైసీపీ నేతపై పోలీసులకు ఫిర్యాదు చేసి, 24 గంటలు అవుతున్నా ఇంతవరకూ కేసు కట్టలేదని ఓ గిరిజన మహిళ మీడియా ఎదుట వాపోయింది. బాధితురాలి కథనం మేరకు...పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన కె.కృష్ణానాయక్ భార్య సునీతకు అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నేత బంధువు బాలిరెడ్డికి ఇంటి స్థలం విషయమై ఐదేళ్లుగా వివాదం నడుస్తోంది. గురువారం సాయంత్రం బాలిరెడ్డి పునాదులు నిర్మిస్తుం డగా సునీత వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో బాలిరెడ్డి, అతని బంధువులు కలసి సునీత జుట్టుపట్టుకుని లాగి, ఇనుపరాడ్డు, రాళ్లతో ఆమె తలపై దాడి చే శారు. ఈ దాడిలో తలపగలడంతో సునీత స్పృహ కోల్పోయింది. కుటుంబసభ్యులు ఆమెను మదనపల్లెలోని ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం సు నీత స్థానిక టుటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కానీ వారినుంచి స్పందన లేకపోవడంతో సాయంత్రం వరకు వేచి చూసిన ఆమె మీడియాతో తన గోడు వెళ్లబోసుకుంది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బాలిరెడ్డిపై ఫిర్యాదు చేస్తే టూటౌన్ పోలీసులు తనపై కేసు కట్టారని ఆరోపించింది. బాధితురాలిపై కేసు నమోదు చేశారని శుక్రవారం హోమంత్రికి ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు ఆమె వివరించింది. ఈ విషయమై ఎస్‌ఐ రహీముల్లాను వివరణ కోరగా స్టేషన్‌కు వచ్చిన బాధితురాలు తమకు ఫిర్యాదు ఇవ్వలేదని, కళ్లు తిరుగుతున్నాయని చెప్పి ఇంటికి వెళ్లిపోయిందన్నారు. ఆమె ఫిర్యాదు ఇస్తే ప్రాథమిక విచారణ చేసి న్యాయం చేస్తామని వివరించారు.

గుర్రంకొండలో దొంగలు పడ్డారు


దొంగలు కత్తిరించిన దుకాణపు రేకు, మరో దుకాణంలో ఖాళీగా గల్లాపెట్టె

గుర్రంకొండ, మార్చి 14: పట్టణంలో గురు వారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. బస్టాండు ప్రాంతంలో చిన్న వ్యాపారులు ఏర్పా టు చేసుకున్న రేకుల బంకులకు కన్నాలేసి అంది నమేరకు దోచుకెళ్లారు. పట్టణానికి చెందిన షైషా వలి దుకాణం వెనుక వైపు రేకును కత్తిరించి లోపలికి చొరబడి రూ.30 వేలు నగదు, రూ.30 విలువ చేసే సిగరెట్లను చోరీ చేశారు. పక్కనే ఉన్న ఆంధ్ర ఎలక్ట్రికల్స్ దుకాణం పైకప్పు రేకును కత్తిరించి రూ.60 వేలు నగదు, జాతీయ రహదారిపై ఉండే బాషాఖాన్ జనరల్ స్టోర్ పైకప్పు రేకును కత్తిరించి రూ.15 వేలు విలువ గల సిగరెట్లు చోరీ చేసినట్లు బాధితులు చెబుతున్నారు. పట్టణంలో ఎన్నడూ లేని విధంగా ఒక రోజు మూడు దుకాణాల్లో చోరీ జరగడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. గుర్రంకొండ పట్టణంలో బయట వ్యక్తులు అధికంగా ఉండడంతోనే చోరీలు జరుగుతున్నట్లు ప్రజలు, వ్యాపారులు చర్చించుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి


కురబల కోట మండలం తానామిట్ట వద్ద ఢీకొన్న వాహనాలు


మృతి చెందిన భాస్కర్, సయ్యద్ హసన్


ప్రమాదంలో మృతి చెందిన నాగరాజు


ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ (ఫైల్‌ఫొటో)

కురబలకోట, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె కురబల కోట, గుర్రంకొండ మండలాల్లో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా ఒకరికి గాయాలయ్యాయి.. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి గ్రానైట్ బండలతో రాజమండ్రికి వెళుతున్న లారీ, సత్యసాయి జిల్లా ఎన్‌పీ కుంట నుంచి బెంగళూరుకు వెళుతున్న కంటైనర్ లారీ శుక్రవారం వేకువన మండలంలోని తానామిట్ట వద్ద ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో రెండు వాహనాలు అధిక వేగంతో వెళుతుండడంతో నుజ్జునుజ్జయ్యాయి. ఈ ప్రమాదంలో కర్నాటక రాష్ట్రం హాసన్ జిల్లా హలేహళ్లికి చెందిన కంటైనర్ డ్రైవర్ భాస్కర్(36), రాయచోటికి చెందిన లారీ క్లీనర్ సయ్యద్ హుస్సేన్(28) అక్కడిక్కడే మృతి చెందారు. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన క్లీనర్ మృతదేహాన్ని వాహనం ముందు బాగాన్ని జేసీబీ సాయంతో తొలగించి బయటకు తీశారు. తల, కాళ్లకు బలమైన గాయాలైన లారీ డ్రైవర్ గాలివీడుకు చెందిన నాగేశ్వరరావును 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రుయా ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు, సీఐ సత్యనారాయణ పరిశీలించారు. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

గుర్రంకొండ: మదనపల్లె మండలం సీటీఎంకు చెందిన వెంకటప్ప కుమారుడు నాగరాజ(45) శుక్రవారం లక్ష్మీనరసింహస్వామి దర్శనం కోసం తరిగొండకు వచ్చాడు. స్వామి వారిని దర్శించుకొని ఆటోలో వాల్మీకిపురానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న నాగరాజ కిందపడడంతో తలకు తీవ్ర రక్తగాయమైంది. వెంటనే అతనిని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

బొలెరో ఢీకొని ఆర్టీసీ డ్రైవర్..

మదనపల్లె అర్బన్: మండలంలోని చీకలబైలు పంచాయతీ బార్లపల్లెకు చెందిన చల్లా సుధాకర్ (48) మదనపల్లె ఆర్టీసీ టూ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం మదనపల్లె నుంచి బైక్‌పై బార్లపల్లెకు వెళుతుండగా బెంగళూరు నుంచి కూరగాయల లోడుతో వస్తున్న బొలెరో ఢీకొట్టింది, ప్రమాదంలో ఆర్టీసీ డ్రైవర్ సుధాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తాలూకా పోలీసులు సంఘటన స్థలం చేరుకుని మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళా వెంకట రమణ తెలిపారు.

వర్డ్‌పవర్ రాష్ట్ర స్థాయి పోటీలో చింతమాకులపల్లె విద్యార్థికిమూడో స్థానం


అన్విత్‌కు బహుమతులు అందజేస్తున్న అధికారులు

కలికిరి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వర్డ్ పవర్ చాంపియన్‌షిప్‌లో మండలంలోని కలికిరి పంచాయతీ చింతమాకులపల్లె ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న పి. అన్విత్ మూడో స్థానంలో నిలిచాడు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆంగ్లంపై ఏ స్థాయిలో పట్టుందన్న విషయాన్ని గుర్తించ డానికి విభాలీప్ వర్డ్ సంస్థ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో 'ది వర్డ్ పవర్ చాంపియన్‌షిప్' పేరుతో విద్యార్థుల మధ్య ప్రతి ఏటా పోటీలు నిర్వహిస్తోంది. ఫిబ్రవరి 27న రాయచోటిలో జరి గిన జిల్లా స్థాయి పోటీల్లో అన్విత్ ప్రథమ స్థానం లో నిలిచాడు. రాష్ట్ర స్థాయిలో పోటీ పడటానికి అర్హత సాధించాడు. విజయవాడ టూరిజం ప్రాంగణంలో గురువారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అన్విత్ మూడో స్థానం దక్కించుకున్నా డు. గురువారం రాత్రి అతనికి అవార్డును బహూకరించారు. విభా సంస్థ పీడీ శ్రీనివాసరావు, కార్యదర్శి వీరనారాయణ, రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారులు అన్విత్‌ను అభినందించి అవార్డుతోపాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఆ విద్యార్థిని తీర్చిదిద్దిన ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భారతి, ఉపాధ్యాయిని హసీనాను అభినందించారు. కాగా అన్విత్ తల్లి ఎం.హేమలత వాల్మీకిపురం మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తున్నారు. ఏ మా త్రం బేషజాలకు పోకుండా తన కుమారుడిని గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలోనే చదివిస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో గుడిసె, డ్రిప్ పైపులు దగ్ధం


కాలిపోయిన గుడిసె

వాల్మీకిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో గుడిసె, డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. మండలంలోని గండబోయనపల్లె పంచాయతీ కంభంవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, వెంకట రమణా రెడ్డి పొలాలు, రైల్వే రోడ్డుకు సమీపంలో ఉన్నాయి. రైల్వే ట్రాక్ పక్కన గడ్డి ఏపుగా పెరిగి పోవడంతో దానిని తొలగించేందుకు శుక్రవారం రైల్వే సిబ్బంది నిప్పంటించారు. దీంతో మంట లు ఎగిసి తమ పొలాల్లోని డ్రిప్ పైపులు, టమోటా పంట, గుడిసె కాలి పోయాయని రైతులు వా పోయారు. ప్రభుత్వం స్పందించి తమకు జరిగిన నష్టం విషయమై ఆదుకోవాలని కోరుతున్నారు.

బిదినంచెర్లలో ఘనంగా గోపూజ మహోత్సవం


గ్రామోత్సవంలో భక్తులు

సింహాద్రిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిదినంచెర లో శుక్రవారం గోపూజ నిర్వహించారు. గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న భాగవత సప్తాహం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారి పూజ, కలశ పూజ, గోపూజ, అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం భాగవత పండితులను బీఎస్ బ్రంహ్మానందరెడ్డి, జడ్పీటీసీ బీఎస్ ఝూన్సీరాణి దంపతులు శాలువాతో సత్కరించారు. గ్రామోత్సవంలో అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు.

రేపు కడపలో మాజీ సైనికుల ర్యాలీ, సమావేశం

మదనపల్లె టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మాజీ సైనికులు, వారి కుటుంబీకుల సమస్యల పరిష్కారం కోసం 16న కడపలో ర్యాలీ, సమావేశం నిర్వహించనున్నట్లు మాజీ సైనికుల సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శుక్రవారం స్థానిక మాజీ సైనికుల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం కడపలో నిర్వహించే మాజీ సైనికుల కార్యక్రమానికి ఏపీ, తెలంగాణ సబ్ ఏరియా లెఫ్టినెంట్ జనరల్ అజయ్‌మిశ్రా, రిటైర్డ్ బ్రిగేడియర్ బి.వెంకట రెడ్డి, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్, కడప కలెక్టర్ హాజరవుతారన్నారు. మాజీ సైనికుల కుటుంబాల విద్య, వైద్యం, పెన్షన్, ఇతర సమస్యలను అధికారులకు విన్నవించుకోవచ్చన్నారు. సైనిక వితంతువుల కోసం మదనపల్లె నుంచి రెండు ఉచిత బస్సులు ఏర్పాటు చేశామన్నారు. కడపలో జరిగే కార్యక్రమాన్ని మాజీ సైనికులు, వారి కుటుంబీకులు విజయవంతం చేయాలని కోరారు. పూర్తి వివరాలకు 95024 26333 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని శ్రీనివాసులు నాయుడు కోరారు.

ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చియ్యవరం చియ్యవరం హరిజనవాడకు చెందిన ఎర్రతోట మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కమ్మపల్లికి చెందిన ముగ్గురిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రైల్వేకోడూరు సీఐ హేమసుందర్ తెలిపారు. బాధితుడు మహేష్ పట్టణంలోని బైకు షోరంలో గురువారం రాత్రి పని ముగించుకుని ఇంటికి వెళుతుండగా వేణు మరో ఇద్దరు బైకుకు అడ్డుపడి దాడి చేసినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక వ్యాపారులు కొట్టారని టిప్పర్ డ్రైవర్ ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తక్కువ రేటుతో మదనపల్లెకు ఇసుక తరలిస్తున్నావంటూ ఇసుక వ్యాపారులు తనను కొట్టారని టిప్పర్ డ్రైవర్ సుబ్రమణ్యం శుక్ర వారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తాము 24 వేలకు టిప్పర్ ఇసుక అమ్ముతుంటే నీవు రూ. 18,500కే ఇసుక అమ్ముతావా అంటూ బిల్డర్ భరత్, ప్రసాద్‌రెడ్డి, రమేష్, ముబారక్‌బాషా, మణి, అమర, మరికొందరు కలిసి కొట్టారని బాధితుడు తెలిపారు. ఇకపై ఇసుక మదనపల్లెకు తీసుకురాకూడదని, తెస్తే తమ వ్యాపారం దెబ్బతింటుందని హెచ్చరించారంటూ స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తమకు న్యాయం చేయాలని కోరారు.

పదో తరగతి పరీక్ష కేంద్రం రద్దు

● ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



నందిమండలంలోని ఉన్నత పాఠశాల

పెండ్లిమర్రి, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోనే మొట్టమొదటగా నందిమండలం గ్రామంలో 1948లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మండలంలో 8 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొదట్లో మండలంలోని విద్యార్థులంతా నందిమండలం ఉన్నత పాఠశాల పరీక్షకేంద్రంగా పరీక్షలు రాసేవారు. ఐతే విద్యార్థుల సంఖ్య పెరిగే కొద్ది పరీక్షకేంద్రాలను వెల్లటూరు, పెండ్లిమర్రి ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. 2023-24 విద్యాసంవత్సరం కూడా చౌటపల్లె, జీసీపల్లె ఉన్నత పాఠశాలల విద్యార్థులు, నందిమండలం పాఠశాల విద్యార్థులతో కలసి ఇక్కడే పరీక్షలు రాశారు. కానీ ఈనెల 17వ తేదీ నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపద్యంలో ఈ పరీక్షా కేందాన్ని రద్దు చేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ పాఠశాల అన్ని గ్రామాలకు సెంటర్ కావడంతో విద్యార్థులకు అనుకూలంగా ఉండేది. పరీక్షా కేంద్రాన్ని ఉన్నపళంగా రద్దు చేయడం అన్యాయమని, విద్యాశాఖ అధికారులు కనీసం పత్రికాముఖంగా కూడా తెలపకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం దారుణమని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నందిమండలం ఉన్నత పాఠశాలలోనే పరీక్షకేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పోలీసుస్టేషన్‌కు దూరంగా ఉండటంతో..

పోలీసు స్టేషన్‌కు దూరంగా ఉన్న పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఉన్నతాధికారులు రద్దు చేశారు. ఇక్కడ మాత్రమే కాదు, జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇలాంటి కేంద్రాలను గుర్తించి రద్దు చేశారు.

- సుజాత, మండల విద్యాశాఖ అధికారి

లక్ష్మీనారసింహుడి కల్యాణం..
లోకాలకే వైభోగం..


బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

వల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనారసింహుడి కల్యాణం.. లోకాలకే వైభోగం అన్నట్లుగా స్వామివారి కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా నిర్వహించారు. మాచిరెడ్డిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం స్వామివారి కల్యాణం నిర్వహించారు. ముందుగా స్వామివారికి వివిధ పూజలు, హోమాలు, అభిషేకాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు చేశారు. అనంతరం మూలవిరాట్‌లను అలంకరించి కళ్యాణవేదికపై ఆశీనులు చేశారు. పుత్తా కుటుంబీకులతో కన్యాదానం చేయించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారి కల్యాణ తంతును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహస్వామి నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారి కల్యాణఘట్టాన్ని వీక్షించారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఎస్పీని శాలువాతో సత్కరించారు. అనంతరం మధ్యాహ్నం అన్న సంతర్పణ చేశారు. అలాగే వృషభరాజముల బండలాగుడు పోటీలను ప్రారంభించారు. నాలుగురోజులుగా నిర్వహించిన వివిధ సాంస్కృతిక, క్రీడా పోటీల విజేతలకు సాయంత్రం బహుమతులు ప్రదానం చేశారు. ఈ బ్రహ్మోత్సవాల్లో పుత్తా నరసింహారెడ్డి భార్య సరళమ్మ, ఎమ్మెల్యే సతీమణి చైతన్యరెడ్డి, పుత్తా సోదరుడు రామచంద్రారెడ్డి, ఆయన భార్య వెంకటసుబ్బమ్మ, యువనేత సాయి నరసింహారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పుష్పగిరి గిరిప్రదర్శనతో పుణ్యఫలం

● అసిస్టెంటు కమిషనర్ మల్లికార్జున ప్రసాద్


గిరిప్రదక్షిణకు ముందు గోపూజ చేస్తున్న దృశ్యం

వల్లూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి గిరి ప్రదక్షిణ చేయడం వల్ల పుణ్యఫలితం లభిస్తుందని దేవదాయ అసిస్టెంటు కమిషనరు మల్లికార్జున ప్రసాద్ తెలిపారు. ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఆయన గిరి ప్రదక్షిణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ గోపూజ కార్యక్రమంతో ప్రారంభమవుతుందన్నారు. గిరిప్రదక్షిణ సంపూర్ణంగా దేవదాయశాఖ, ఆలయ అనువంశిక ధర్మకర్త సమక్షంలో కొండ చుట్టూ గ్రామ సేవా కమిటీ సభ్యుల సహాయ సహకారాలతో జరుగుతుందన్నారు. ముందుగా లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో నూతనంగా గిరిప్రదక్షిణ కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త వెంకటసుబ్బారెడ్డి, బసిరెడ్డి భక్తులు ఉచిత వాహన సదుపాయం ఏర్పాటు చేశారు.

అల్లర్లు చేసినా.. గొడవలు సృష్టించినా కఠిన చర్యలే

● డీఎస్పీ వెంకటేశ్వర్లు


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెట్టే విధంగా ఎవరు నడుచుకున్నా, అల్లర్లు చేసినా, గొడవలు సృష్టించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించడంతో పాటు కేసులు, ఇటీవల జరిగిన సంఘటనలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో జాతరలు, పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులు నిర్వహిస్తుంటారని, అలా జరిగే సమయంలో ఎవరైనా గొడవలకు దిగి, ఇబ్బందులు కలిగిస్తే వారిపై తీవ్ర చర్యలుంటాయన్నారు. కొన్ని అల్లరి మూకలు అదేపనిగా గొడవలకు మూలం అవుతున్నాయని, వాటిపై పోలీసులు అలర్ట్‌గా ఉండి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాటర్ గండి, పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె ఆనకట్టలాంటి ప్రాంతాల్లో ఆదివారం, సెలవు దినాల్లో బోర్డులు చూసి నీటిలో దిగకుండా జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. అలాగే చెన్నూరు క్రాసింగ్ నుంచి కొండపేట రోడ్డు వరకు రోడ్డులో ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలన్నారు. రంజాన్ తరువాత ఈ విషయంపై దృష్టి సారించి ఇబ్బందులు లేకుండా తొలగింపులు చేపడతామన్నారు. అలాగే ఇసుక, బియ్యం అక్రమ రవాణా జరగకుండా నిరంతరం నిఘా పెంచాలని సీఐ పురుషోత్తంరాజుకు సూచించారు.

వంకలతో ప్రమాదం

● వర్షాకాలంలో ఆ గ్రామాలు జలదిగ్బంధమే
● బాహ్యప్రపంచంతో సంబంధం కట్
● నేటికీ శివాలపల్లె, రాచిన్నాయపల్లె, ముండ్లపల్లె, రామనపల్లెలో ఇదే పరిస్థితి..
● పట్టించుకోని పాలకులు

చెన్నూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎవరికైనా ప్రాణాపాయ పరిస్థితి వస్తే ఎటు వెళ్లాలన్నా చుట్టూ నీరే.. వంకలపై ఉన్న లోలెవల్ కాజ్‌వేలపై వంకలు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. దీంతో వంకలు దాటలేని పరిస్థితి, గ్రామంలో వైద్యం లేని దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లోనే మండలంలోని శివాలపల్లె, రాచిన్నాయపల్లె, రామనపల్లె, ముండ్లపల్లె ఉన్నాయి. ఈ గ్రామాలు వంకలతో ముప్పు తప్పించలేకున్నాయి. ఒక్కోమారు రోజుల తరబడి రాకపోకలు చేయలేని పరిస్థితి. ఈ సమస్యల నుండి గట్టెక్కించాలని ఎన్నో ఏళ్లుగా కోరుతున్నా నాయకులు స్పందించడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా వంకల గురించి పట్టించుకునే వారే కరువయ్యారని ఆరోపిస్తున్నారు. నేటికీ ఒక్క వంకపై చిన్నపాటి హైలెవల్ వంతెన కూడా ఏర్పాటు చేయలేదంటే ప్రజలపై ఎంత నిర్లక్ష్యమోనని ఆవేదన చెందుతున్నారు.

ముండ్లపల్లె-రామనపల్లె పరిస్థితి

ముండ్లపల్లె గ్రామ సమీపంలో ఓబులంపల్లె వెళ్లే దారిలో ఉన్న ఉప్పువంక వర్షాకాలం ఉధృతంగా ప్రవహిస్తుంది. ఏమరుపాటుగా అందులో అడుగుపెడితే గల్లంతు కావాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో ఈ వంకపై ఉన్న చిన్నపాటి లోలెవల్ కాజ్‌వేను మరో 5 అడుగుల ఎత్తు పెంచితే సమస్య ఉండదని ప్రజలు చెబుతున్నారు. ఆ దిశగా ఎవరూ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే చెన్నూరు నుండి రామనపల్లె వచ్చే వంక పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఎన్నో మార్లు ఎడ్లు, ఎనుములు, ద్విచక్ర వాహనదారులు ఈ వంకలో పడిపోయారు. లోలెవల్ కాజ్‌వేను ఎత్తు పెంచాలని ఏళ్ల తరబడి అడుగుతున్నా పట్టించుకునేవారు లేరని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

జింకల వంక పొంగితే..

మంచి రైతులు, ఉన్నత విద్యావంతులు ఉన్న గ్రామం శివాలపల్లె. కానీ ఆ ఊరికి పక్కనే ఉన్న జింకల వంక పొంగితే తగ్గేంత వరకు వారు మండల కేంద్రానికి రాలేరు. వచ్చే అవకాశం లేదు. దాటడానికి చిన్న కాజ్‌వే కూడా లేదు. ఒకవేళ రావాలంటే దాదాపు పది, పన్నెండు కిలోమీటర్లు చుట్టి రావాల్సిందే. మూడు కిలోమీటర్ల దూరంలో ఉండే మండల కేంద్రానికి రావాలంటే ఈ ప్రయాస ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


శివాలపల్లె వద్ద జింకల వంకపై ఉన్న లోలెవల్ కాజ్‌వే

రాళ్ల వంకతో రాచిన్నాయపల్లెకు ముప్పు

రాచిన్నాయపల్లె సమీపంలోని రాళ్లవంక ప్రతి ఏటా వర్షానికి పెద్ద నదిలా ప్రవహిస్తుంది. దీంతో ఇక్కడ ఉన్న లోలెవల్ కాజ్‌వే దాటడం వీలుకాదు. ఫలితంగా కడప నగరానికి రామనపల్లె, చిన్నమాచుపల్లె మీదుగా సుమారు 10 కి.మీ తిరిగి వెళ్లాల్సిందే. కళ్లముందు కనిపించే నగరానికి వెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదని ప్రజలు బాధపడుతున్నారు. వంకపై హైలెవెల్ కాజ్‌వే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


రాచిన్నాయపల్లె సమీపంలో రాళ్ల వంకపై లోలెవల్ కాజ్‌వే

మా సమస్య తీర్చండి..



ఎన్నో ఏళ్లుగా జింకల వంకతో ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం మా పరిస్థితి మరీ దారుణం. వంకకు నీరు వచ్చిందంటే బయటికి వెళ్లలేని పరిస్థితి, బిక్కుబిక్కుమంటూ కూర్చోవాల్సిందే. పాలకులు స్పందించి ఈ వంకపై హైలెవెల్ కాజ్‌వే ఏర్పాటు చేయాలి.

- సుంకేసుల శ్రీనివాసులు, శివాలపల్లె

ప్రమాదాలు లేకుండా చూడాలి..



ముండ్లపల్లె వంక వల్ల భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. వీలైనంత త్వరగా వంకలపై హైలెవెల్ కాజ్‌వేలు ఏర్పాటు చేస్తే వర్షాకాలంలో ఎలాంటి ఇబ్బంది ఉండదు.

- యామల మణికంఠ, ముండ్లపల్లె

సబ్‌జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు
మొదటిరోజు హోరాహోరీ

● తలపడనున్న 13 జిల్లాల జట్లు ● క్రీడారంగం బలోపేతానికి కృషి : ఎమ్మెల్సీ


పోటీలకు హాజరైన 13జిల్లాల కబడ్డీ జట్లు

పులివెందుల రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో మూడు రోజుల పాటు జరిగే 34వ అంతర్ జిల్లాల సబ్ జూనియర్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వైఎస్సార్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి, పులివెందుల ఆర్డీవో చెన్నయ్య ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను, కబడ్డీ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ కేడట్లు 13 జిల్లాల క్రీడాకారులతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడారంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. పీపీపీ విధానాన్ని అమలు చేసి విద్యాసంస్థలలో ప్రతి వంద సీట్లలో మూడు సీట్లు క్రీడాకారులకు కేటాయించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్, డీఎస్‌డీఓ జగన్నాథరెడ్డి, మాజీ డీఎస్పీ రామచంద్రారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గురుశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జున్‌రావు, సెక్రటరీ వెంకటసుబ్బయ్య, ట్రెజరర్ కొండయ్య, కోచ్ శ్రీధర్, ఇన్‌చార్జి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన పోటీలు

పులివెందులలో జరిగిన అంతర్‌జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ అండ్ గర్ల్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు హోరాహోరీగా సాగాయి. బాయ్స్ విభాగంలో కడప, విశాఖపట్టణం తలపడగా కడప 26పాయింట్లతో గెలిచింది. అలాగే కృష్ణా, నెల్లూరు మధ్య జరిగిన పోటీలో కృష్ణా.. అనంతపురం, చిత్తూరు మధ్య జరిగిన పోటీలో చిత్తూరు.. విశాఖపట్టణం, విజయనగరం మధ్య జరిగిన పోటీలో విజయనగరం గెలిచాయి. అలాగే గర్ల్స్ విభాగంలో కడప, ఈస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీలో కడప.. నెల్లూరు, వెస్ట్‌గోదావరి మధ్య జరిగిన పోటీలో వెస్ట్‌గోదావరి.. విశాఖపట్టణం, చిత్తూరు మధ్య జరిగిన పోటీలో విశాఖపట్టణం.. కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య జరిగిన పోటీలో కృష్ణా జట్టు విజేతలుగా నిలిచాయి.

చికెన్ దుకాణంలో అగ్నిప్రమాదం

● రూ1.80.లక్షల ఆస్తినష్టం

ఎర్రగుంట్ల, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల మండలం చిలమకూరులోని ముద్దనూరు రోడ్డులో నరేష్‌కుమార్(బుజ్జి)కి చెందిన చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.1.80లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గురువారం రాత్రి 9గంటలకు చికెన్ సెంటర్‌ను మూసివేశానని, తెల్లవారుజామున 2.40గంటలకు షాపు, కోళ్లు కాలిపోతున్నాయని ఫోన్‌వచ్చిందని తెలిపాడు. ఈ ప్రమాదంలో 70 కోళ్లు, రెండు కాటా మిషన్‌లు, టేబుల్ ఫ్యాన్, నాలుగు కుర్చీలు, రూ.1.70 అప్పులపట్టీ, రెండు సిలిండర్స్, విద్యుత్ మీటర్ కాలిబూడిదయ్యాయని వాపోయాడు. అగ్నిప్రమాదం ఎలా జరిగిందో తెలియడంలేదని, సుమారు రూ.1.80లక్షలు ఆస్తినష్టం జరిగిందన్నాడు.

విద్యార్థిని ఆత్మహత్య


మృతి చెందిన అక్షయ

జమ్మలమడుగు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాల వసతి గృహంలో శుక్రవారం మధ్యాహ్నం అక్షయ (18) అనే విద్యార్థిని విషద్రావణం తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకోగా సిబ్బంది, స్థానికులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాంబెల్ వైద్యశాలకు తరలించగా రాత్రి 8.30 గంటల సమయంలో అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆ వివరాల్లోకి వెళితే.. పెద్దముడియం మండలం కొండసుంకేసులకు చెందిన అక్షయ జమ్మలమడుగు నాగులకట్ట వీధిలోని ప్రభుత్వ వసతిగృహంలో ఉంటూ ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. వసతి గృహంలోని ఇతర విద్యార్థినులతో మనస్పర్థలు రావడంతో విరక్తి చెంది విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుందని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. ఘటన జరిగిన వెంటనే అర్బన్ సీఐ, ఏఎస్‌డబ్ల్యూ గురుప్రసాద్ ఆస్పత్రికి వెళ్లి పరిశీలించారు. విషయం తెలిసిన వెంటనే పట్టణంలోని విద్యార్థి సంఘాలు, టీఎన్ఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ, సీపీఐ నాయకులు వసతి గృహంలో జరిగే సమస్యలపై ఏఎస్‌డబ్ల్యూతో మాట్లాడారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఒక్కగానొక్క కూతురు చనిపోవడంతో విద్యార్థిని తల్లి పద్మావతి బోరున విలపించింది. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట విద్యార్థి సంఘ నాయకులతో పాటు ఆమె ఆందోళనకు దిగారు.

శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

● జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర

కడప రూరల్, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): శారీరక దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమానికి కృషిచేయాలని ఆ సంఘం ఉమ్మడి కడప జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నకొట్టి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ విశ్రాంత ఉద్యోగుల భవనంలో శారీరక దివ్యాంగ ఉద్యోగుల (అన్నీ ప్రభుత్వశాఖలు) సంక్షేమ సంఘం ఉమ్మడి కడప జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డి.మల్లయ్య నేతృత్వంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అన్నం చిన్నసుబ్బయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. సంఘం నూతన కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనతో పాటు గౌరవ అధ్యక్షుడుగా బి.సుధాకర్, జిల్లా అధ్యక్షుడుగా పులిమి జేమ్స్, జిల్లా ట్రెజరర్‌గా బత్తుల చంద్రశేఖర్, జిల్లా సమాచార కార్యదర్శిగా పి. సుబ్బరాజు, జిల్లా కార్యదర్శులుగా వై. గుర్రప్ప, హెచ్. నరసింహులు, జిల్లా కన్వీనర్‌గా యం. రవిశంకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లాలోని శారీరక దివ్యాంగ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైలుకింద పడి వృద్ధుడు మృతి

ముద్దనూరు, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్రపాడు గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బీంచర్ల శివారెడ్డి (91) రైలు కింద పడి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రైల్వే ఎస్ఐ సమాచారం మేరకు.. బీంచర్ల శివారెడ్డి సొంత గ్రామం కొర్రపాడు. 10 సంవత్సరాల నుంచి ప్రొద్దుటూరులోని దొరసానిపల్లెలో నివాసం ఉంటున్నారు. మతిస్థిమితంలేని కారణంగా కొర్రపాడుకు వచ్చి రైలు కింద పడి మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేడుకగా లక్ష్మీ నృసింహుడి ఉత్సవాలు

కిటకిటలాడిన గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం ● వైభవంగా తంబళ్లపల్లె తిరునాళ్లు
శేషవాహనంపై పాపేపల్లి లక్ష్మీనరసింహస్వామి ● కదిరినాథునికోటలో గొడుగు ఊరేగింపు

లక్ష్మీనృసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. కదిరి పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం పెద్దతిప్పసముద్రం మండలం గొందిపల్లె సమీప కదిరిదేవుని గుట్టల్లో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లెలో లక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్లను గ్రామస్తులు నిర్వహించారు. పెద్దమండ్యెం మండలం పాపేపల్లి లక్ష్మీనరసింహస్వామి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ములకలచెరువు మండలం కదిరినాథునికోటలో లక్ష్మీనరసింహస్వామి గొడుగును ఊరేగించారు. వివరాల్లోకెళితే...





పీటీఎం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులు - శేషవాహనంపై పాపేపల్లి లక్ష్మీనరసింహస్వామి - ములకలచెరువులో స్వామి వారి గొడుగును ఊరేగిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం మార్చి 14 (ఆంధ్రజ్యోతి): కదిరి పౌర్ణమిని పురస్కరించుకుని కదిరిదేవుని గుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచీ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి ఇలవేల్పు లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. కదిరికి వెళ్లి నరసింహస్వామిని దర్శించుకునే వీలు లేని వారు ఈ ఆలయానికి కుటుంబ సమేతంగా వెళ్లి మొక్కులు తీర్చుకుంటారు. బి.కొత్తకోట, పీటీఎం మండలం భక్తులే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద కోలాట భజనలు, నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఆలయంలో హరికథ కాలక్షేపం నిర్వహించారు. ఆలయ పూజారి సహా మునిరెడ్డి, గొందిపల్లె బాస్కర్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైభవంగా తంబళ్లపల్లె తిరునాళ్లు

తంబళ్లపల్లె, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కుక్కరాజుపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి తిరునాళ్లను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయ పూజారి మల్‌రెడ్డి లక్ష్మీ నరసింహ స్వామి వారిని వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలతో పూజలు చేశారు. టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లె జయచంద్రారెడ్డి కూటమి నేతలతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, రాష్ట్ర బీసీ ఉపాధ్యక్షుడు తులసీధర్‌నాయుడు నేతలు పాల్గొన్నారు.

శేషవాహనంపై పాపేపల్లి లక్ష్మీనరసింహస్వామి

పెద్దమండ్యం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పాపేపల్లి లక్ష్మీ నరసింహస్వామి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పగలు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు విష్ణుమాచార్యులు, యాజ్ఞకులు రఘునాథాచార్యులు, ఉభయదారులు తల్లం గోపాలక్రిష్ణయ్య కుటుంబీకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా గొడుగు ఊరేగింపు

ములకలచెరువు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): కదిరినాథునికోటలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి గొడుగును శుక్రవారం ములకలచెరువులో ఘనంగా ఊరేగించారు. 22, 23వతేదీల్లో స్వామి వారి తిరునాళ్ల ఉత్సవం జరగనుంది. ఉత్సవాలకు వారం రోజుల ముందు స్వామి వారి గొడుగును ములకలచెరువులో ఊరేగించడం ఆనవాయితీ.



వాల్మీకిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మార్చి ప్రారంభంలోనే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఉదయం పది గంటల నుంచే ఎండలు మండిపోతున్నాయంటూ ప్రజలు రోడ్లపైకి రావడం లేదు. అత్యవసరమైతే తప్ప ప్రజలు రెడ్డెక్కేందుకు సాహసించడంలేదు. వేసవి ప్రారంభానికి ముందే మండే ఎండలు హెచ్చరికలు చేస్తున్నాయి. కోడిగుడ్లు తీసుకెళ్లేవారు పొరబాటున కిందపడేసుకున్నా నిముషంలోపే ఆమ్లెట్ తయారయ్యేలా రోడ్లు వేడెక్కాయి. ఒకవేళ ఇప్పటికే విద్యుత్ పరికరాల తయారీ దారులు ధర లు పెంచేశారు. కూలర్లు, ఫ్యాన్ల మరమ్మతులు, ఏసీలకు మెయింటెనెన్స్ అం టూ రకరకాలుగా ధరలు పెంచేస్తున్నారు. సామాన్యులు ఉక్కపోత భరించలేక ఫ్యాన్లతోనే సర్దుబాటవుతున్నారు. ధనవంతులు బయటకు రాకపోయినా ఇంట్లో ఏసీలకు అతుక్కు పోతున్నారు. అత్యవసర పని నిమిత్తం రోడ్డుపైకి వచ్చిన ఇతర గ్రామీణులు ఆటోలు, బస్సుల కోసం ఏచి ఉంటున్న వారు ఎండతీవ్ర తకు తట్టుకోలేక చెట్లను ఆశ్రయిస్తున్నారు. ఏ కాస్తంత చెట్టు నీడ దొరికినా సేద తీర్చుకుని ఉపసమనం పొందారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో బస్టాండ్ సముదాయాలు, దుకాణాలు ఎండవేడిమి తాళలేక నిర్మానుష్యంగా కనిపించాయి. 36డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో జనం రోడ్ల పైకి రావాలన్నా బెంబేలెత్తిపోయారు. భానుడి భగభగలు వచ్చే మూడునెలల పాటు ఇంకెంతగా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు.





కార్మికులకు రమజాన్ తోఫా పంపిణీ

పీలేరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ న్యాయవాది షౌకత్ అలీ శుక్రవారం తన ప్రాంత పరిధిలోని పలువురికి రమజాన్ తోఫా అందజేశారు. నిత్యావసర సరుకులతో కూడిన కిట్లను ఆయన పంపిణీ చేశారు. పవిత్ర రమజాన్ మాసం సందర్భంగా అందరూ సుఖసంతోషాలతో పండుగ చేసుకోవాలన్న లక్ష్యంతో వివిధ రంగాల్లోని కార్మికులకు తోఫా అందజేసినట్లు ఆయన వివరించారు. స్థానికులు ఇబ్రహీం, సలీమ్ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న షౌకత్‌అలీ

నేటి నుంచి ఒంటిపూట బడి

పెద్దతిప్పసముద్రం/తంబళ్లపల్లె, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు ఆయా ఎంఈఓలు నారాయణ, త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు నేటి నుంచి ఏప్రిల్ 23 వరకు ఉదయం 7:45 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12:30 నిమిషాల వరకు పాఠశాలలు కొనసాగనున్నట్లు తెలిపారు. టెన్త్ పరీక్షలు జరిగే పాఠశాలల్లో మాత్రం పరీక్షలు ముగిసే వరకు మధ్యాహ్నం 1:15 నిమిషాల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు.

'నారికేళి' చిత్రీకరణ ప్రారంభం

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం, బర్మావీధిలోని షిరిడి సాయిబాబా ఆలయంలో వైష్ణవి మూవీ మేకర్ ఆధ్వర్యంలో నారికేళి చిత్రం షూటింగ్‌ను శుక్రవారం ప్రారంభించారు. చిత్రనిర్మాత చంద్రశేఖర్, డైరెక్టర్ రెడ్డిప్రసాద్ క్లాప్ కొట్టి మొదట యూనిట్‌ను ప్రారంభించారు. హీరో, హీరోయిన్లుగా కిరణ్ గోవిందసాయి, స్వాతిరెడ్డి నటిస్తున్నట్లు డీఓపీ ప్రసాద్, తెలిపారు.

ఘనంగా హోలీ పండుగ

పీలేరు/వాల్మీకిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పీలేరు, వాల్మీకిపురంలో హోలీ పండుగను ఘనంగా చేసుకున్నారు. పీలేరు, వాల్మీకిపురంలోని మార్వాడీలు, రాజస్థానీయులు, స్థానిక యువతీ యువకులు ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ సమూహంగా పరస్పరం శుభాకాంక్షలు ప్రకటించుకున్నారు. ఇళ్లలో ప్రత్యేక వంటకాలు, బంధుమిత్రులతో విందులు ఏర్పాటు చేసుకున్నారు. వాల్మీకిపురం మార్వాడీలు మంగీలాల్, శంకర్ లాల్, కేశవరామ్, కిషన్, ఆసారామ్, సుఖదేవ్, యువతీయువకులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

ములకలచెరువు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. నాగభూషణం(బురకాయలకోట), నరసింహులు(మద్దినాయనిపల్లె) తీవ్ర అనారోగ్యంతో చికిత్స చేయించుకున్నారు. దీంతో నాగభూషణానికి రూ.2.05లక్షలు, నరసింహులుకు రూ.85వేలు ఆర్థిక సహాయం అందజేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ గతిని మార్చిన విప్లవయోధుడు కార్ల్‌మార్క్స్

వర్ధంతి సభలో బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్



కార్ల్‌మార్క్స్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న పీటీఎం శివప్రసాద్, తదితరులు

మదనపల్లె, మార్చి 14(ఆంధ్రజ్యోతి): తలకిందులుగా ఉన్న తత్వశాస్త్రాన్ని నిటారుగా నిలిపి, సామాజిక, ఆర్థిక, రాజకీయ విప్లవాలకు బాట వేసి ప్రపంచ గతిని మార్చిన విప్లవ యోధుడు కార్ల్ మార్క్స్ అని బాస్ వ్యవస్థాపకుడు పీటీఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. బాస్ కార్యాలయంలో కార్ల్ మార్క్స్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. బాస్ జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, కోశాధికారి రమణ, గంగులు, క్రాంతి, లక్ష్మీనారాయణ, గంగాధర్, బి.నరసింహులు, ప్రశాంత్, శరత్, అభి పాల్గొన్నారు.

మహనీయులకు ఘన నివాళి

వాల్మీకిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ఆల్‌బర్ట్ ఐన్‌స్టీన్ జయంతి, సోషలిస్ట్ విప్లవకారుడు కార్ల్‌మార్క్స్ వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేసుకున్నారు. ఏపీ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో ఐన్‌స్టీన్, కార్ల్‌మార్క్స్ చిత్రపటాలకు నివాళులర్పించారు. జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్, ప్రిన్సిపాల్ నవమల్లిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గజవాహనంపై గట్టు వేంకటేశ్వరస్వామి



రామసముద్రం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చెంబకూరు మేజర్ పంచాయతీ గట్టు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారిని గజవాహనంపై ఊరేగించారు. మేళతాళాలు, చెక్కభజనలు, కోలాటాలు, బాణసంచాతో స్వామివారిని ఊరేగించారు. గోవిందనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఈసందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని రాజకీయం చేసింది జగనే'

మదనపల్లె టౌన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో విద్యారంగాన్ని రాజకీయం చేసింది వైఎస్ జగనే అని జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దిగిపోయేటప్పుడు రూ.4,500 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలుపెట్టి పోయిందన్నారు. ఇప్పుడు చూస్తే యువపోరు అని నిరసనలు తెలుపుతూ డ్రామాలు ఆడుతున్నారన్నారు. నిజానికి వైసీపీ ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. మంత్రి నారా లోకేశ్ నూతన విద్యావిధానాన్ని అమలు చేసేందుకు ఇంటర్‌లో ఎంబైపీసీ కోర్సులు ప్రవేశపెడుతున్నారన్నారు. వైసీపీ నేతలు ఉనికి కోసం పోరాటాలు నిలుపుకోవాలని హితవు పలికారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

వాల్మీకిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ విశేష సంఖ్యలో భక్తులు హాజరు కాగా వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ధర్మపథం సమూహాలయంలో శుక్రవారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో పౌర్ణమి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం ఆలయంలో వెలసిన దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు జరిగాయి. రాత్రికి పౌర్ణమి వెలుగులో కార్యసిద్ది అభయాంజనేయస్వామికి సింధూర పూజ, ఆకుపూజ, తోమాలసేవ, వడమాల సేవలతో పూజలు జరిగాయి. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థినులు

వాల్మీకిపురం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. వాల్మీకిపురం మండలం చింతపర్తి మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యార్థినులు గెడి నిహారిక మూడో స్థానంలో, హర్షిణి నాలుగు స్థానాల్లో నిలిచారు. విజయవాడలో 13న నిర్వహించిన డబ్ల్యూపీసీ (వరల్డ్ పవర్ ఛాంపియన్ షిప్) రాష్ట్ర పోటీల్లో వీరు ప్రతిభ చాటారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించిన విద్యార్థినులకు బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం నాగరాజ, ఉపాధ్యాయ బృందం వనజ, అనురాధ, సుమలత, యల్లప్ప, మల్లికార్జున విద్యార్థినులను అభినందించి ప్రోత్సహించారు. విద్యార్థుల ప్రతిభకు కారణమైన ఇంగ్లీష్ టీచర్ శశికళను ప్రత్యేకంగా అభినందించారు.

వైభవంగా అక్కగార్ల నగరోత్సవం



వాల్మీకిపురం, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం అక్కదేవతల జాతర మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గొందికుంట ప్రాంతంలో వెలసిన అక్కదేవతల ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజారి వెంకటరాజు ఇంటి నుంచి పుష్ప పల్లకీలు, మట్టి గుర్రాలకు పూజలు నిర్వహించి మంగళవాయిద్యాలు, చాందినీ బండ్లతో పుర వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. అనంతరం గొందికుంటలోని అక్కదే వతల ఆలయం వద్ద ప్రతిష్ఠింప చేసి విశేష పూజలు, వేడుకలు వైభవంగా సాగాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు సుజాత, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం

రామసముద్రం/నిమ్మనపల్లి, మార్చి 14(ఆంధ్రజ్యోతి): రామసముద్రం, నిమ్మనపల్లి మండలాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను నియమించారు. రామసముద్రం మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా కేసీపల్లికి చెందిన సీఆర్ సతీష్‌రెడ్డి, నిమ్మనపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా కటిక శేఖర్‌ను నియమిస్తూ పీసీసీ షర్మిల నుంచి ఆదేశాలు అందినట్లు వారు తెలిపారు. ఈయన నియామకం పట్ల మండల కాంగ్రెస్ పార్టీ నేతలు, అన్నమయ్య జిల్లా టీసీసీ ప్రెసిడెంట్ గాజుల భాస్కర్ అభినందనలు తెలిపారు.

పాలు, పాల ఉత్పత్తులపై విద్యార్థులకు అవగాహన

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): పిల్లలు పాలు తాగడం వలన కలిగే ప్రయోజనాలను తిరుపతి శ్రీజ కంపెనీ, జైకా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. సీటీఎం చిల్లింగ్ సెంటర్‌ను మదనపల్లె పీపుల్ ట్రీ స్కూల్ విద్యార్థులు సందర్శించారు. కంపెనీ నిర్వాహకులు శంకర్, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థినికి బంగారు పతకం బహూకరణ



కావలి చైత్రకు బంగారు పతకం అందజేస్తున్న హెచ్‌ఎం ఫౌజియా బేగం

పీలేరు, మార్చి 14(ఆంధ్రజ్యోతి): టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన పీలేరు జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కావలి చైత్రకు ఆ పాఠశాల విశ్రాంత హెచ్‌ఎం పద్మావతమ్మ బంగారు పతకం బహూకరించారు. 2023-24లో చైత్ర పాఠశాలలో ప్రథమ స్థానం సాధించింది. ఆమె ప్రతిభకు ప్రోత్సాహకంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఫౌజియా బేగం బంగారు పతకం బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది విజయ కుమారి, జానం సుజాత, బోధనేతర సిబ్బంది హారిక, అంజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సిటింగ్ ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేయాలి

మదనపల్లె అర్బన్, మార్చి 14(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేకంగా సిటింగ్స్ ఏర్పాటు చేస్తున్న వైన్స్‌షాపుల లైసెన్స్ రద్దు చేసి, కేసులను నమోదు చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎన్టీయూ కార్యాలయంలోని మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి పీలె నరసింహులు మాట్లాడుతూ పట్టణంలో వైన్‌షాపుల సమీపంలో, షాపుల్లో అనుమతులు లేకుండా సిటింగ్స్ ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారని, నిత్యం జన సంచార ప్రాంతాల్లో మద్యం షాపులు ఉన్నందున ప్రజలకు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఎక్సైజ్, పోలీస్ శాఖలు స్పందించకుంటే సోమవారం మదనపల్లె సబ్ కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యులు సాంబశివ, నియోజకవర్గ కార్యదర్శి మురళి, నేతలు, తదితరులు పాల్గొన్నారు.